మానేరు **జనత** ®

తెలుగు దినపత్రిక ఇది జనం గొంతుక

14.4.2026 మంగళవారం Tuesday | సంపుటి (Volume): 10 సంచిక (Issue) : 354 | పేజీలు : 8 Pages : 8 | వెల : 2 | Published from : Karimnagar


## రాయల్స్‌పై హైదరాబాద్ ఘన విజయం




సమస్య ఏదైనా
జనం కోసం జనతా..
ఇదే మా ఆహ్వానం
ప్రజలు, ప్రభుత్వానికి మధ్య వారధి మీడియా
ప్రజా సమస్యలను వెలికితీసి..
వాటి పరిష్కారానికి పునాది వేసేది మీడియా
మీ సమస్య ఏదైనా మీ తరుపున నిలబడి
అటు అధికారులను గానీ,ఇటు రాజకీయ నాయకులను గానీ
నిలదీస్తూ, నిజాన్ని నిగ్గు తేలుస్తుంది జనతా..
రండి..మీ కలాన్ని కదపండి..
మీ గళాన్ని వినిపించండి.
అందరం కలిసికట్టుగా..
"జనతా"తో కలిసి ప్రజా సమస్యలపై పోరాడుదాం..!!
మొక్కవోని దీక్షతో పని చేద్దాం.. తగ్గేదేలే..!
జనం కోసం "జనతా"..

శ్రేయోభిలాషులు..
సంప్రదించాల్సిన మొబైల్ నంబర్.. 7989867251
- ఎడిటర్

## వచ్చే విద్యా సంవత్సరానికి డిగ్రీ ప్రవేశాలు

15నుంచి సీట్ల భర్తీకి తొలివిడత ప్రక్రియ

తెలంగాణలో దోస్త్ నోటిఫికేషన్ విడుదల



.. వివరాలు 2లో

## మొబైల్ ఫోన్ల కొనుగోళ్లపై అసత్య ప్రచారాలు

కేసీఆర్‌కు లీగల్ నోటీసులు పంపిన సీతక్క



.. వివరాలు 2లో

## ఢిల్లీ లిక్కర్ స్కామ్ కేసు

ఢిల్లీ హైకోర్టులో విచారణ

దర్యాప్తు సంస్థల తీరుపై మండిపడ్డ కేజ్రీవాల్



.. వివరాలు 2లో




### మహిళా రిజర్వేషన్లతో పునర్విభజన లింక్

# రాజకీయ కుట్ర

### పునర్విభజనను రాజకీయ పావుగా వాడుకుంటున్న మోడీ

జనాభా లెక్కల అనంతరం మహిళా బిల్లు అని చెప్పారు

ఆ మేరకే గతంలో బిల్లు పెట్టి..ఇప్పుడీ హడావిడి ఎందుకు?

పార్లమెంట్ ప్రత్యేక సమావేశాలపై అనుమానాలు ఉన్నాయి

2011 జనాభా లెక్కల ప్రకారం మహిళా రిజర్వేషన్లు అమలు చేయాలి

జనాభా లెక్కల తరవాత నియోజకవర్గాల పునర్విభజనపై చర్చించాలి

దక్షిణాదిని దెబ్బతీసే కుట్రలో భాగంగానే ఉత్తరాది సీట్ల పెంపు

50శాతం సీట్ల పెంపు ఏ ప్రాతిపదకనో ఎందుకు చెప్పడం లేదు

మీడియా సమావేశంలో సిఎం రేవంత్ రెడ్డి ఆగ్రహం




**జనతా న్యూస్, హైదరాబాద్, ఏప్రిల్13 :** మహిళారిజర్వేషన్లు, పునర్విభజనను కలపడంతో రాజకీయ కుట్ర ఉందని సిఎం రేవంత్ రెడ్డి ఆరోపించారు. 2026 జనాభా లెక్కల ప్రకారం మహిళా రిజర్వేషన్లబిల్లు తీసుకువస్తే కాంగ్రెస్ పార్టీ సంపూర్ణ మద్దతు ఇవ్వడంతో పాటు కట్టుబడి ఉంటామని ప్రకటించిన విషయాన్ని గుర్తు చేశారు. హిళలరాజకీయసాధికారితకు కాంగ్రెస్ మొదటి నుంచి కట్టుబడి ఉ ంది..నియోజకవర్గాల పునర్విభజనను ప్రధాని మోదీ రాజకీయ పావుగా ప్రమాదకరంగా వాడుకుంటున్నాడని ఆరోపించారు. డీలిమిటేషన్, మహిళా రిజర్వేషన్ల అంశాలపై తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కీలక

మిగతా 2 లో

## మహిళలంటే బీజేపీకి చిన్నచూపు

### 15మంది బీజేపీ అధ్యక్షులు మారినా..మహిళలకు చోటేది

ముఖ్య పదవుల్లో కూడా మహిళలకు చోటివ్వని బిజెపి

కాంగ్రెస్‌లో ఇందిర, సోనియాలు అధ్యక్షులుగా పనిచేశారు

బండి సంజయ్ విమర్శలు మాని నిజాలు తెలుసుకోవాలి

మీడియా సమావేశంలో సీఎం రేవంత్ రెడ్డి చురకలు

## పశ్చిమాసియాలో మళ్లీ యుద్ధమేఘాలు

ఇరాన్‌పై దాడికి ట్రంప్, ఇజ్రాయిల్ సమాలోచనలు

ఎప్పుడు ఏం జరుగుతుందో అన్న ఆందోళన




అమెరికా-ఇరాన్ మధ్య శాంతి చర్చలు విఫలమవడంతో పశ్చిమాసియా మళ్లీ నివురుగప్పిన నిప్పులా మారింది. ఏ క్షణాన ఏం జరుగుతుందో అర్థం కాని పరిస్థితి నెలకొంది. మరోవైపు, ఇరాన్‌పై మళ్లీ దాడులు ప్రారంభించేందుకు అమెరికా, ఇజ్రాయెల్ సిద్ధమవుతున్నట్లు వార్తలు రావడం ఆందోళన కలిగిస్తోంది. హర్మూజ్ జలసంధిని దిగ్బంధిస్తామని అమెరికా సెంట్రల్ కమాండ్ ఇప్పటికే ప్రకటించిన సంగతి తెలిసిందే. దీంతో పాటు ఇరాన్‌పై పరిమిత స్థాయిలో సైనిక దాడులను పునరుద్ధరించేలా అగ్రరాజ్య అధ్యక్షుడు ట్రంప్ సలహాదారులు ప్రణాళికలు రచిస్తున్నట్లు తెలుస్తోంది.

04

## హోర్ముజ్‌పై ట్రంప్ వ్యాఖ్యలు

### దిగ్బంధిస్తే తీవ్ర పరిణామాలు

### ఘాటుగా హెచ్చరికలు చేసిన ఇరాన్



హోర్ముజ్‌ను దిగ్బంధిస్తామన్న అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ హెచ్చరిక లపై ఇరాన్ మరోసారి ఘాటుగా స్పందించింది. హోర్ముజ్ ఇప్పటికీ తమ నియంత్రణలోనే ఉందని పేర్కొంది. శత్రువులు ఏ చిన్న పొరపాటు చేసినా ప్రమాదం తప్పదని హెచ్చరించింది. అంతకుముందు ఇరాన్ సైనిక దళం (ఐఆర్‌జీసీ) కూడా ట్రంప్‌కు గట్టి వార్నింగ్ ఇచ్చిన విషయం తెలిసిందే.

### మహిళా రిజర్వేషన్లపై రేవంత్‌కు

## అవగాహన లేదు

పార్లమెంట్ చర్చలో ఎంపీలు ఎవరైనా మాట్లాడవచ్చు

రేవంత్ ఎక్స్ పోస్ట్‌పై కిషన్‌రెడ్డి అభ్యంతరం



మహిళా రిజర్వేషన్లపైన సీఎం రేవంత్ రెడ్డి అవగాహన లోపంతో మాట్లాడుతున్నారని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి తెలిపారు. 15, 16, 17 తేదీల్లో పార్లమెంట్‌లో జరిగే చర్చలో అందరు ఎంపీలు మాట్లాడవచ్చని వెల్లడించారు. మహిళలకు చట్టసభల్లో రిజర్వేషన్లు కల్పించాలని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఈ నిర్ణయం తీసుకున్నారని వివరించారు. మహిళా రిజర్వేషన్లపై రాజకీయాలు చేయొద్దని కాంగ్రెస్‌ని కోరారు.

## ఓటుకు.. నోటుకు లంకె పెట్టినట్లు అనుకున్నారా



మహిళా బిల్లు, డీలిమిటేషన్‌తో వచ్చే నష్టమేమిటో

సిఎం వ్యాఖ్యలపై మండిపడ్డ బండి సంజయ్



04

## ఆశాకు క్రికెటర్ సచిన్ నివాళి



04

## మరోమారు ఎదురు కాల్పులు

మహిళా మావోయిస్టు నాయకురాలు మృతి

అడవుల్లో కొనసాగుతున్న కూంబింగ్

## భూ పరిపాలనకు కొత్త దిక్సూచి భూభారతి



చరిత్రాత్మక చట్టానికి నేటితో ఏడాది పూర్తి

ఏడాదిలో 5కోట్లకు పైగా భూభారతి పోర్టల్ సందర్శన

70 లక్షల మంది పోర్టల్ ద్వారా లాగిన్

పాతసర్వే పద్ధతులకు స్వస్తి- రోవర్లతో సర్వే

ప్రతి సర్వే నెంబర్‌కు భూధార్

రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

ఆనాటి బిఆర్ఎస్ ప్రభుత్వంలో కుప్పకూలిన రెవెన్యూ వ్యవస్థను గౌరవ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారి నాయకత్వంలో పునర్నిర్మిస్తున్నామని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. భూహక్కుల పరిరక్షణ, పారదర్శకత, అవినీతి రహిత సేవలు సామాన్యుడికి సులభంగా అందేలా గత ఏడాది రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన భూభారతి చట్టం తెలంగాణ చరిత్రలో కీలక సంస్కరణగా నిలుస్తోందన్నారు.

# మహిళా రిజర్వేషన్లతో పునర్విభజన లింక్

# రాజకీయ కుట్ర

మొదటి పేజీ తరువాయి

వ్యాఖ్యలు చేశారు. మహిళా రిజర్వేషన్ బిల్లు ఆమోదం కోసమే పార్లమెంట్ ప్రత్యేక సమావేశాలు నిర్వహిస్తున్నారని ఆయన పేర్కొన్నారు. డీలిమిటేషన్ అనేది రాజకీయ పార్టీలకో, ప్రభుత్వానికో సంబంధించిన అంశం కాదని స్పష్టం చేసిన సీఎం రేవంత్, దీనిని మహిళా రిజర్వేషన్లతో కలిపి చూపించడం సరైంది కాదన్నారు. అయితే కేంద్ర ప్రభుత్వం ఈ రెండు అంశాలను కలిపి వ్యూహాత్మకంగా ముందుకు సాగుతోందని విమర్శించారు. సోమవారం సాయంత్రం సచివాలయంలో ఆయన మంత్రులు, ఎంపిలు, ఇతర నాయకులతో కలసి మీడియా సమావేశంలో మాట్లాడారు. మహిళా రిజర్వేషన్ల విషయంలో కాంగ్రెస్ పార్టీకి వ్యతిరేకంగా దుష్ప్రచారం జరుగుతోందని రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. మహిళలకు ఓటుహక్కు, రాజకీయ రిజర్వేషన్లు కల్పించడంలో కాంగ్రెస్ పార్టీ కీలక పాత్ర పోషించిందని ఆయన గుర్తు చేశారు. కాంగ్రెస్ హయాంలోనే మహిళలు ముఖ్యమైన పదవులు చేపట్టిన విషయాన్ని కూడా ఆయన ప్రస్తావించారు. మహిళా రిజర్వేషన్లు, డీలిమిటేషన్ రెండూ వేర్వేరు అంశాలని స్పష్టం చేసిన రేవంత్ రెడ్డి, వీటిని కలిపి బీజేపీ రాజకీయ ప్రయోజనాల కోసం ఉపయోగిస్తోందని విమర్శించారు. ముఖ్యంగా 2011 జనాభా లెక్కల ఆధారంగా ఈ రెండు అంశాలను అనుసంధానించడం వెనుక రాజకీయ కుట్ర, వివక్ష ఉన్నాయని అన్నారు. మహిళా రిజర్వేషన్ బిల్లుకు తమ పూర్తి మద్దతు ఉందని ప్రకటించిన సీఎం రేవంత్, ప్రస్తుతం ఉన్న పార్లమెంట్ సీట్ల ఆధారంగానే ఈ బిల్లును అమలు చేయాలని కేంద్రాన్ని కోరారు. 2024 సార్వత్రిక ఎన్నికల సమయంలోనే ఈ బిల్లును అమలు చేసి ఉంటే, మరింత మంది మహిళలు పార్లమెంట్‌కు ఎన్నికయ్యే వారని రేవంత్ రెడ్డి అభిప్రాయపడ్డారు. రాజ్యాంగంలోనే పురుషులతో పాటు మహిళలకు ఓటు హక్కు ఇచ్చింది కాంగ్రెస్ పార్టీ అని అన్నారు. అప్పటికిప్రపంచంలోని చాలా దేశాల్లో మహిళలకు ఓటు హక్కు లేదు..

పురుషులతో పాటు మహిళలకు సమాన అవకాశాలు కల్పించింది కాంగ్రెస్ పార్టీ మాత్రమేనని అన్నారు. దేశ ప్రధానిగా, రాష్ట్రపతిగా, లోక్ సభస్పీకర్ గా, ముఖ్యమంత్రులుగా, గవర్నర్లుగా చాలా రాజ్యాంగబద్ధమైన పదవుల్లో మహిళలకు కాంగ్రెస్ అవకాశం కల్పించిందని గుర్తు చేశారు. మహిళల నాయకత్వంలోపనిచేసిన పార్టీ కాంగ్రెస్.. రాజీవ్ గాంధీ స్థానిక సంస్థల్లోమహిళలకు రిజర్వేషన్లుతీసుకువచ్చారు.. సోనియా గాంధీ నాయకత్వంలో చట్టసభల్లో మహిళా రిజర్వేషన్ బిల్లు తీసుకువచ్చారు.. అప్పుడు రాజ్యసభలో ఆమోదించారు.. బీజేపీ సహకరించకపోవడం వల్లనే లోక్ సభలో మహిళారిజర్వేషన్ బిల్లు ఆమోదం పొందలేద న్నారు. ఇంతకాలం ప్రధాని మోదీ ఈ బిల్లును పట్టించుకోలేదు. 2023 లో మహిళారిజర్వేషన్ బిల్లుకు కాంగ్రెస్ పార్టీ సంపూర్ణ మద్దతుఇచ్చింది.. 2026 జనాభాలెక్కల తర్వాతగెజిట్ ఆధారంగా మహిళారి జర్వేషన్లు అమలు చేస్తామని చట్టం చేశారు... 2026 జనభా లెక్కలు పూర్తి చేసి అమలు చేయకుండా 2011జనాభాలెక్కల ఆధారంగా చట్టం ముందుకు తెస్తున్నారు.. 2026జనాభా లెక్కలప్రకారం నిబంధనను సవరించుకుంటే 2029 లోక్ సభతో పాటు వివిధ రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల్లో మహిళా రిజర్వేషన్లు అమలుచేయోచ్చన్నారు. ఇకపోతే 2011 జనాభా లెక్కల ప్రకారం డీలిమిటేషన్ చేయాలని ఎన్డీయే చూస్తోందన్నారు. కానీ, 2026 జనాభా లెక్కల ప్రకారం డీలిమిటేషన్, మహిళా రిజర్వేషన్లు అమలు చేయాలన్నది కాంగ్రెస్ డిమాండ్ అని చెప్పారు. ఈ రెండింటినీ కలపడం, పాత జనాభా లెక్కల ప్రకారం వెళ్లడంలో కుట్ర ఉందని ఆక్షేపించారు. 33శాతం మహిళా రిజర్వేషన్లకు కాంగ్రెస్ సంపూర్ణ మద్దతు ఇస్తుందన్నారు. ఈ రిజర్వేషన్లను ఆర్నెల్లలోనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. డీలిమిటేషన్ పక్రియ చాలా ప్రమాదకర దిశలో వెళ్తోంది. చిన్న రాష్ట్రాలు, దక్షిణాదికి అన్యాయం జరిగేలా మోదీ కుట్ర చేస్తున్నారు. కుటుంబ నియంత్రణను దక్షిణాది రాష్ట్రాలు సమర్థంగా అమలు చేశాయి. ఉత్తరాదిలో అది సరిగ్గా అమలు కాకపోవడం వల్లే జనాభా విపరీతంగా పెరిగింది. జనాభా ప్రాతిపదికన సీట్ల పెంపు వద్దని దక్షిణాది రాష్ట్రాలు గట్టిగా చెప్పాయి. దక్షిణాది రాష్ట్రాల వ్యతిరేకత వల్ల మోదీ కొత్త ప్రతిపాదన తీసుకొచ్చారు. ప్రతి రాష్ట్రంలో 50శాతం సీట్లు పెంచుతామని చెబుతున్నారు. ఇలా చేస్తే.. యూపీ, బిహార్, మధ్యప్రదేశ్, రాజస్థాన్‌లలో సీట్లు బాగా పెరగనున్నాయి. ఉత్తరాది, దక్షిణాది రాష్ట్రాల మధ్య లోక్‌సభ సీట్లలో అంతరం భారీగా పెరుగుతుందన్నారు. సీట్ల పెంపు తర్వాత దక్షిణాదిలో 195 లోక్‌సభ స్థానాలు అవుతాయి. ఉత్తరాదిలో సీట్లు 620కి పెరుగుతాయి. ఉత్తర, దక్షిణాది మధ్య ప్రస్తుతం ఉన్న 210 సీట్ల అంతరం 412కి పెరుగుతుంది. ఎన్డీయే ప్రభుత్వంలో దక్షిణాది రాష్ట్రాలకు ఏమాత్రం ప్రాధాన్యం దక్కడం లేదు. కేంద్రంలోని కీలక శాఖలు ఏవీ దక్షిణాది రాష్ట్రాలకు ఇవ్వడం లేదు. సీట్లు పెంచాలనుకుంటే అఖిలపక్షాన్ని పిలిచి మాట్లాడాలి. ఏ ప్రాతిపదికన 50 శాతం సీట్లు పెంచుతారు? సీట్లు 50 శాతం పెంచాలని మోదీకి ఏ దేవుడు చెప్పాడు? 50శాతం సీట్లు పెంచితే ఉత్తరాది, దక్షిణాది మధ్య తీవ్ర అంతరం ఏర్పడుతుంది. దక్షిణాదిపై చూపుతున్న వివక్షతో దేశ సమగ్రతకు ముప్పు వాటిల్లే ప్రమాదం ఉందని హెచ్చరించారు. దక్షిణాది రాష్ట్రాల పట్ల వివక్షను మరింత పెంచేలా భాజపా వ్యవహరిస్తోందన్నారు. దక్షిణాది రాష్ట్రాల పరిస్థితి.. పన్నులు కట్టడం, దిల్లీకి వెళ్లి సలాం కొట్టడం అన్నట్లుగా ఉంది. దీనికి మేం వ్యతిరేకం. దక్షిణాది రాష్ట్రాలు దేశానికి ఫైనాన్షియల్ కేపిటల్స్. ఉత్తరాది రాష్ట్రాలు పొలిటికల్ కేపిటల్స్. పొలిటికల్ కేపిటల్స్ ఎప్పుడూ ఫైనాన్షియల్ కేపిటల్స్‌ని తక్కువగా చూస్తాయి. దక్షిణాది రాష్ట్రాలు ద్వితీయ శ్రేణి పౌరులుగా మిగిలిపోతారని అన్నారు. హైబ్రిడ్ ప్రాతిపదికన సీట్లు పెంచాలనేది మా డిమాండ్. కొత్తగా పెంచే సీట్లలో 50 శాతానికి జీడీపీని ప్రాతిపదికగా తీసుకోవాలి. కొత్తగా పెంచే సీట్లలో 136 సీట్లు జీడీపీ వృద్ధి ఆధారంగా పెంచాలి. మరో 136 సీట్లను జనాభా ప్రాతిపదికగా పెంచాలి. దేశానికి ఆదాయం ఇస్తున్న రాష్ట్రాలను గౌరవించాలి. చిన్న రాష్ట్రాలకు కూడా న్యాయం జరిగేలా గతంలో సీట్ల కేటాయింపు జరిగిందని రేవంత్‌రెడ్డి అన్నారు. మీడియా సమావేశంల మంత్రులు భట్టి విక్రమార్క, పొన్నం ప్రభాకర్, కోమటిరెడ్డి, సీతక్క, పొంగులేటి, ఎంపిలు రఘురామిరెడ్డి, మల్లు రవి, సలహాదారు కేశవరావు తదితరులు పాల్గొన్నారు.




## మహిళలంటేబీజేపీకి చిన్నచూపు

హైదరాబాద్,ఏప్రిల్13 : సీట్ల పునర్విభజనలో పర్సంటేజీలు కాదు నెంబర్ ముఖ్యం అని సిఎం రేవంత్ రెడ్డి అన్నారు. రాజకీయాల్లో నెంబర్ ముఖ్యం అంటూ.. వాజపేయి ప్రభుత్వం ఒక్క ఓటుతో పడిపోయిందని గుర్తు చేశారు. నెంబర్ లేకుండా రాజకీయాల్లో ఎవరూ ఎవరితోనూ చర్చలు చేయరని అన్నారు. ఇకపోతే ఇప్పటివరకు15 మంది బీజేపీ అధ్యక్షుల నియామకం జరిగింది.. కాని ఇప్పటివరకు భారతీయజనతా పార్టీ అధ్యక్షురాలి గా ఒక్క మహిళ నియామకంజరగలేదని సిఎం రేవంత్ చురకలంటించారు. బీజేపీకి మహిళ పట్లగౌరవం, చిత్తశుద్ధి ఉందో అర్థమౌతుందన్నారు. ఇందిరాగాంధీ, సోనియా గాంధీ నాయకత్వంలో అతి ఎక్కువ కాలం పనిచేసిన పార్టీ కాంగ్రెస్ మహిళలకు అన్యాయం చేస్తుందా.. అని ప్రశ్నించారు. బీజేపీకి మహిళను అధ్యక్షురాలిగా నియమించుకున్న తర్వాత బండి సంజయ్ మాట్లాడాలన్నారు. బండి సంజయ్ వ్యాఖ్యలుదక్షణాది రాష్టాల్లోని ఎస్సీ,ఎస్టీ, మహిళలకు వ్యతిరేకం.. అన్నారు. మా ఎంపీలు తెలంగాణను సాధించారు.. ఇప్పుడు పునర్విభజన పైన కూడా పోరాడుతారని సిఎం అన్నారు. దక్షిణాది రాష్ట్రాలతో పాటు చిన్న రాష్ట్రాలను కూడా ఐక్యం చేస్తాం అని అన్నారు. పార్లమెంట్ లో బిల్లును ఎలా ఆమోదిస్తారోచూస్తాం.. 60యేళ్లలోమహిళల కోసం కాంగ్రెస్ పార్టీ చాలా చేసింది..46యేళ్లలో ఒక్క మహిళను పార్టీ అధ్యక్షురాలిని బీజేపీచేయలేదు.. జనరల్ సెక్రటరీ ఆర్గనైజేషన్పదవి కూడా ఇవ్వలేదన్నారు. మహిళలను చిన్న చూపు చూడటమే బీజేపీలక్షణం.. ద్వితీయ శ్రేణి పౌరులుగా మహిళలను చూస్తున్నారు..స్వాతంత్య్రం తెచ్చింది, రాజ్యాంగాన్ని తెచ్చింది, రిజర్వేషన్లుకల్పించింది కాంగ్రెస్ పార్టీ.. ఇప్పుడు దేశాన్ని కాపాడుకునే బాధ్యత కూడా కాంగ్రెస్ దే.. అన్నారు. యాభై శాతంతో సీట్ల పునర్విభజన జరిగితే కిషన్ రెడ్డి, బండి సంజయ్ లు మోదీ ఇంటి ముందు బంట్రోతు లుగానిలబడాల్సి వస్తుంది.. వాళ్ల అవసరం ఇక ముందు ఉండదన్నారు. అన్ని దక్షిణాది రాష్ట్రాలతో పాటు ఢిల్లీ, పంజాబ్ లాంటి చిన్న రాష్ట్రాలకు కుదినిపైన లేఖ రాస్తానని సిఎం రేవంత్ అన్నారు. గతంలోనియోజకవర్గాలపునర్విభజన మూడు సార్లు జరిగింది.. 1967 లో 520సీట్లకు పెంచారు,1976 లో 542సీట్లకుపెంచారు..తర్వాత సిక్కిం నుంచి ఒక సీటు పెరిగి 543 కి పెరిగింది.. 2001 లో వాజ్ పేయి పునర్విభజన పైన చట్టసవరణ చేశారు. దాని వల్ల 2009 లో తెలంగాణకు17 ఎంపీ సీట్లు , ఆంధ్రాకు25 ఎంపీ సీట్లు వచ్చాయి...తెలంగాణ కు 119 అసెంబ్లీ సీట్లు, ఎపీకి175శాసన సభ సీట్లు పెరిగాయి.. స్థూల ఉత్పత్తిలోఅత్యధికంగాభాగస్వామ్యం చేస్తున్న రాష్ట్రాలకు అవకాశం ఇవ్వాలి.. ఈ శా న్య రాష్టాల్లో, కేంద్ర పాలిత ప్రాంతాల్లో జనాభాప్రాతిపాదికన సీట్లు లేవు.. 100 శాతం జనాభాప్రాతిపదికన సీట్ల పెంపు జరగలేదు.. ప్రాతినిధ్యం కోసమే ఈశాన్య రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లో ఎంపీ సీట్లు ఇచ్చారని సిఎం గుర్తు చేశారు. సీట్ల పునర్వ్యజభన పైన అఖిల పక్ష సమావేశంతో పాటు అన్ని సంస్థలతోసంప్రదింపులు చేయాలి.. పార్లమెంటులోపునర్విభజన పైన చర్చించాలి.. నిపుణలతో ఒక కమిటీ ఏర్పాటు చేయాలి.. అన్ని అసెంబ్లీల్లో చర్చకు పెట్టి పార్లమెంటులో ఆమోదించి నిర్ణయం తీసుకోవాలి.. 2028 మార్చి వరకు ఈ పక్రియను పూర్తి చేయోచ్చు...హడావుడి గా చేసి దేశంలో దక్షణ, ఉత్తరాది మధ్యగ్యాప్ పెంచొద్దని సిఎం రేవంత్ డిమాండ్ చేశారు.

## వచ్చే విద్యా సంవత్సరానికి డిగ్రీ ప్రవేశాలు

### 15నుంచి సీట్ల భర్తీకి తొలివిడత ప్రక్రియ

### తెలంగాణలో దోస్త్ నోటిఫికేషన్ విడుదల

**హైదరాబాద్,ఏప్రిల్13 :** రాష్ట్రంలో వచ్చే విద్యా సంవత్సరం 2026-27లో ప్రభుత్వ, ప్రైవేటు డిగ్రీ కాలేజీల్లో సీట్ల భర్తీకి నిర్వహించే దోస్త్ నోటిఫికేషన్‌ను తెలంగాణ ఉన్నత విద్యామండలి విడుదల చేసింది. ఈనెల 15వ తేదీ నుంచి మే 7వ తేదీ వరకు తొలి విడతలో సీట్ల భర్తీ పక్రియ కొనసాగుతుంది. అర్హులైన విద్యార్థులు రూ.200 రిజిస్ట్రేషన్ ఫీజు చెల్లించి దరఖాస్తు చేసుకోవాలి. ఏప్రిల్ 30వ తేదీ నుంచి మే 8వ తేదీ వరకు వెబ్ ఆప్షన్లకు అవకాశం కల్పించారు. ఒక మే 14వ తేదీన తొలి దశ సీట్ల కేటాయింపు జరగనుంది. సీట్ల కేటాయింపు అనంతరం ఆన్‌లైన్‌లో సెల్ఫ్ రిపోర్టింగ్ చేయాల్సి ఉంటుంది. ఇక రెండో దశ సీట్ల రిజిస్ట్రేషన్ పక్రియ మే 15వ తేదీ నుంచి మే 25వ తేదీ వరకు కొనసాగనుంది. మే 15వ తేదీ నుంచి మే 26వ తేదీ వరకు వెబ్ ఆప్షన్లు ఇచ్చుకోవచ్చు. మే 30వ తేదీ సీట్లు కేటాయిస్తారు. మూడో విడత రిజిస్ట్రేషన్ పక్రియ మే 31వ తేదీ నుంచి జూన్ 15వ తేదీ వరకు జరగనుంది. జూన్ 16వ తేదీ వరకు వెబ్ ఆప్షన్లు ఇచ్చుకోవచ్చు. జూన్ 20వ తేదీన సీట్ల కేటాయింపు ఉంటుంది. రెండో, మూడో విడత సీట్ల కేటాయింపు అనంతరం కూడా ఆన్‌లైన్‌లో సెల్ఫ్ రిపోర్టింగ్ చేయాల్సి ఉంటుంది. సీట్లు పొందిన విద్యార్థులు ఆయా కాలేజీల్లో జూన్ 20 నుంచి 27వ తేదీ మధ్యలో హాజరై అడ్మిషన్ పక్రియను పూర్తి చేయాల్సి ఉంటుంది. జూన్ 29, 30వ తేదీల్లో ఓరియంటేషన్ కార్యక్రమాలు నిర్వహిస్తారు. జూలై 1వ తేదీ నుంచి తరగతులు ప్రారంభమవుతాయి.

## మొబైల్ ఫోన్ల కొనుగోళ్లపై అసత్య ప్రచారాలు

### కేసీఆర్‌కు లీగల్ నోటీసులు పంపిన సీతక్క



**హైదరాబాద్,ఏప్రిల్13 :** బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ కు మంత్రి సీతక్క లీగల్ నోటీసులు పంపించారు. బీఆర్ఎస్ పార్టీ సోషల్ మీడియా చేస్తున్న తప్పుడు ఆరోపణలకు కేసీఆర్ బాధ్యత వహించాలని నోటీసుల్లో పేర్కొన్నారు. సోమవారం 13న రిజస్టర్ పోస్టు ద్వారా కేసీఆర్ కు లీగల్ నోటీసులు పంపించారు సీతక్క. సీతక్క తరుపు అడ్వకేట్ నాగులూరి కృష్ణ కుమార్ రిజిస్టర్ పోస్టు ద్వారా కేసీఆర్ కు లీగల్ నోటీస్ పంపించారు. అంగన్వాడి మొబైల్ ఫోన్ల కొనుగోలు విషయంలో నిరాధార ఆరోపణలు చేస్తూ తన ప్రతిష్టకు భంగం వాటిల్లేలా బీఆర్ఎస్ సోషల్ మీడియాలో పోస్టులు పెడుతోందని.. అందుకు కేసీర్ బాధ్యత వహించాలనంటూ నోటీసుల్లో పేర్కొన్నారు. అంగన్వాడీ మొబైల్ ఫోన్ల కొనుగోలు పక్రియను తెలంగాణ టెక్నాలజీ సర్వీసెస్ లిమిటెడ్ నిర్వహించిందని తెలిపారు. టెండర్ ఇవాల్యుయేషన్ కమిటీ నిర్ణయాల ప్రకారం కాంట్రాక్ట్ ఇవ్వడం జరిగిందని, ఇందులో తనకు ఎలాంటి సంబంధం లేదని నోటీసులో స్పష్టం చేశారు. మొత్తం టెండర్ విలువ 44 కోట్ల రూపాయలే ఉన్నప్పటికీ, అందులో రూ. 30 కోట్ల అవినీతి జరిగిందని చెప్పడం అసంబద్ధమని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆధారాలు లేని ఆరోపణగా పేర్కొన్నారు. ఖా పార్టీ అఫీషియల్ సోషల్ మీడియాలో జరుగుతున్న దుష్ప్రచారానికి కేసీఆర్ బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. తన ప్రతిష్టను దెబ్బతీసేలా కుట్రపూరితంగా వ్యవహరిస్తున్నారని నోటీసులో పేర్కొన్నారు మంత్రి సీతక్క. 48 గంటల్లో పోస్టులు తొలగించి కేసీఆర్ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. లేదంటే సివిల్, క్రిమినల్ చర్యలు తీసుకుంటానని లీగల్ నోటీసులో పేర్కొన్నారు.

## ఒంటరి వృద్ధురాలిపై దాడి

### రోకలిబండతో బాదిన దుండుగులు... బంగారం దోచుకుని పరార్

**కామారెడ్డి,ఏప్రిల్13 :** కామారెడ్డి జిల్లాలోని భిక్కనూరు మండల కేంద్రంలో జరిగిన దారుణ ఘటన స్థానికంగా తీవ్ర కలకలం రేపింది. ఇంట్లోకి చొరబడి ఓ వృద్ధురాలిపై రోకలిబండతో దాడి చేసి, ఆమె బంగారు ఆభరణాలను అపహరించిన ఘటన ప్రజలను భయభ్రాంతులకు గురి చేసింది. ఈ సంఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. భిక్కనూరు మండల కేంద్రంలో నివసిస్తున్న ఓ వృద్ధురాలు తన ఇంట్లో ఒంటరిగా ఉన్న సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు ఇంట్లోకి చొరబడ్డారు. ఆ సమయంలో ఆమెపై అకస్మాత్తుగా దాడికి పాల్పడ్డారు. దాడికి రోకలి బండను ఉపయోగించినట్లు సమాచారం. ఈ దాడిలో వృద్ధురాలు తీవ్రంగా గాయపడింది. దాడి సమయంలో ఆమె అరుస్తూ సహాయం కోరినప్పటికీ, దుండగులు ఆమె బంగారు ఆభరణాలను బలవంతంగా లాక్కొని పరారయ్యారు. వాటి విలువ ఎంతన్నది పూర్తిగా నిర్ధారణ కాలేదు. ఈ ఘటనలో వృద్ధురాలి తలకు తీవ్ర గాయాలైనట్లు వైద్యులు తెలిపారు. రక్తస్రావం అధికంగా ఉండటంతో స్థానికులు వెంటనే స్పందించి ఆమెను సమీప ఆస్పత్రికి తరలించారు. అక్కడ ప్రాథమిక చికిత్స అందించారు. ఆమె ఆరోగ్య పరిస్థితిపై వైద్య బృందం నిరంతరం పర్యవేక్షిస్తోంది. ఈ దారుణ ఘటనతో భిక్కనూరు ప్రాంత ప్రజల్లో భయాందోళన నెలకొంది. వృద్ధురాలిపై ఇంతటి క్రూరమైన దాడి జరగడంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. దుండగులు ముందుగా ఇంటి పరిస్థితిని గమనించి, ఎవరు లేని సమయం చూసి లోపలికి చొరబడినట్లు పోలీసులు భావిస్తున్నారు. బంగారు ఆభరణాల సమాచారం ముందుగానే తెలిసి ఉండవచ్చని అనుమానిస్తున్నారు. ఈ దాడి పథకం ప్రకారం జరిగిందా లేదా అకస్మాత్తుగా జరిగిన దోపిడీనా అనే కోణంలో పోలీసులు విచారణ చేస్తున్నారు. ససమాచారం అందుకున్న వెంటనే పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు వేగవంతం చేశారు. ఈ ప్రాంతంలోని సీసీటీవీ ఫుటేజ్‌ను సేకరించి, అనుమానితులను గుర్తించడానికి చర్యలు చేపట్టారు. స్థానికుల నుంచి కూడా సమాచారం సేకరిస్తున్నారు. పోలీసులు ఈ ఘటనను సీరియస్‌గా తీసుకుని, దోషులను త్వరలోనే పట్టుకుంటామని తెలిపారు.

## నాంపల్లి రెడ్‌హిల్స్‌లో అగ్నిప్రమాదం

### సకాలంలో మంటలను ఆర్పిన ఫైర్ సిబ్బంది

**హైదరాబాద్,ఏప్రిల్13 :** నాంపల్లి రెడ్‌హిల్స్‌లోని మూడంతస్తుల భవనంలో సోమవారం భారీ అగ్నిప్రమాదం సంభవించింది. భవనం మూడో అంతస్తులో షార్ట్ సర్క్యూట్ కారణంగా ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. ప్రమాద సమయంలో భవనంలో 23 మంది నివాసితులు ఉన్నారు. స్థానికులు ఇచ్చిన సమాచారం మేరకు వెంటనే అగ్నిమాపక సిబ్బంది అక్కడకు చేరుకున్నారు. భవనంలో చిక్కుకున్న 23 మందిని సురక్షితంగా బయటకు తీసుకొచ్చారు. ఈ ఘటనలో ఎవరికీ గాయాలు కాలేదని, ప్రాణనష్టం ఏమీ లేదని అధికారులు తెలిపారు. మంటలు వేగంగా వ్యాప్తి చెందే అవకాశం ఉన్నప్పటికీ, అగ్నిమాపక శాఖ సిబ్బంది త్వరితగతిన స్పందించి.. మంటలు ఇతర ఫ్లోర్లకు వ్యాపించకుండా నివారించారు. చివరకు మంటలను పూర్తిగా అదుపులోకి తీసుకొచ్చారు. భవనంలో ఒక్కసారిగా మంటలు వ్యాపించడంతో స్థానికులు భయాందోళనకు గురయ్యారు. మంటలు పూర్తిగా అదుపులోకి రావడం, ఎలాంటి ప్రాణనష్టం జరగకపోవడంతో అంతా ఊపిరిపీల్చుకున్నారు. అగ్నిప్రమాదంపై స్థానిక పోలీసులు, అగ్నిమాపక అధికారులు దర్యాప్తు మొదలుపెట్టారు.

## తట్టేపల్లి వద్ద ఘోర రోడ్డు ప్రమాదం

### స్కూటీని ఢీకొట్టిన లారీ,.. ప్రమాదంలో దంపతులతో సహా చిన్నారి మృతి

**వికారాబాద్,ఏప్రిల్13 :** వికారాబాద్ జిల్లాలో తీవ్ర విషాదం నెలకొంది. పెద్దేముల్ మండలం తట్టేపల్లి దగ్గర ఓ టూ వీలర్‌ను లారీ ఢీకొట్టింది. ఈ ఘటనలో భార్యాభర్తలు సహా ఓ చిన్నారి దుర్మరణం చెందింది. మృతులు తాండూరు నుంచి జహీరాబాద్ వైపు వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగినట్లు తెలుస్తోంది. కాగా, యాక్సిడెంట్ తర్వాత పారిపోయిన లారీ డ్రైవర్.. పెద్దేముల్ పోలీస్ స్టేషన్‌లో లొంగిపోయినట్లు తెలుస్తోంది. పెద్దేముల్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వికారాబాద్ జిల్లా పెద్దేముల్ మండల పరిధిలోని త్తటెపల్లి గ్రామ శివారులో రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. ఈ ఘటనలో ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు మృతి చెందారు. వికారాబాద్ జిల్లా రుక్మాపూర్ గ్రామానికి చెందిన పావని (35), ఆమె భర్త కవిరాజ్ (40) జహీరాబాద్‌లో నివసిస్తున్నారు. వీరు ఆదివారం సాయంత్రం జహీరాబాద్ నుంచి రుక్మాపూర్ గ్రామానికి వెళ్లారు. తిరిగి వస్తుండగా లారీ వీరి స్కూటీని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో పావని, కవిరాజ్, కీర్తన అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. కుమారుడు కార్తీక్ స్వల్ప గాయాలతో ప్రాణాలతో బయటపడ్డాడు. చికిత్స నిమిత్తం తాండూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రమాదానికి కారణమైన లారీ డ్రైవర్ మహమ్మద్ షరీఫ్‌పై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు పెద్దేముల్ పోలీసులు తెలిపారు.

## విషగుళికలు తిని చిన్నారి మృతి

**ములుగు,ఏప్రిల్13 :** ములుగు జిల్లాలో తీవ్ర విషాదం నెలకొంది. కోతుల బెడద తప్పించు కోవడానికి పెట్టిన విషగుళికలు తిని నాలుగేళ్ల బాలుడు మరణించాడు. వివరాల్లోకి వెళ్తే.. ములుగు జిల్లా గోవిందరావుపేటలోని కోతుల బెడద ఎక్కువగా ఉంది. దీంతో కోతులను చంపేందుకు అంగన్‌వాడీ కేంద్రంలోని నర్సరీ ప్రాంతంలో గ్రామ పంచాయతీ సిబ్బంది విషగుళికలను పెట్టారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్న పిల్లలకు ఇచ్చే బాలామృతంలో వాసన లేకుండా ఉండే విష గుళికలను కలిపి పెట్టారు. ఎన్టీఆర్ నగర్‌కు చెందిన ఆర్ఎంపీ వైద్యుడు శ్రవణ్ కుమారుడు హర్షిత్ నందన్ (4) ఆదివారం సాయంత్రం స్నేహితులతో ఆడుకుంటూ అంగన్‌వాడీ కేంద్రం సమీపంలోకి వెళ్లాడు. ఆ సమయంలో విష గుళికలు కలిపిన బాలామృతం చూశాడు. దాన్ని తినేశాడు. అనంతరం అస్వస్థతకు గురవ్వడంతో గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే ములుగు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో వరంగల్ ఎంజీఎం తరలించారు. అక్కడే చికిత్స పొందుతూ హర్షిత్ సోమవారం తెల్లవారుజామున మృతిచెందాడు.

మానేరు జనత
తెలుగు దినపత్రిక ఇది జనం గొంతుక
www.epaperjanathadaily.in
మంగళవారం 14 ఏప్రిల్ 2026


# మహిళా రిజర్వేషన్లపై రేవంత్‌కు అవగాహన లేదు

## పార్లమెంట్ చర్చలో ఎంపీలు ఎవరైనా మాట్లాడవచ్చు
## రేవంత్ ఎక్స్ పోస్ట్‌పై కిషన్ రెడ్డి అభ్యంతరం



**హైదరాబాద్,ఏప్రిల్13 :** మహిళా రిజర్వేషన్లపైన సీఎం రేవంత్ రెడ్డి అవగాహన లోపంతో మాట్లాడుతున్నారని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి తెలిపారు. 15, 16, 17 తేదీల్లో పార్లమెంట్‌లో జరిగే చర్చలో అందరు ఎంపీలు మాట్లాడవచ్చని వెల్లడించారు. మహిళలకు చట్టసభల్లో రిజర్వేషన్లు కల్పించాలని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఈ నిర్ణయం తీసుకున్నారని వివరించారు. మహిళా రిజర్వేషన్లపై రాజకీయాలు చేయొద్దని కాంగ్రెస్‌ని కోరారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీకి మహిళా రిజర్వేషన్లు, డీలిమిటేషన్‌పై సీఎం రేవంత్‌రెడ్డి చేసిన ఎక్స్ పోస్టుపై కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి స్పందించారు. దశాబ్దాలుగా కాంగ్రెస్ పరిపాలన చేసిందని.. అంబేడ్కర్ చెప్పిన మహిళల రిజర్వేషన్ల గురించి ఎందుకు పట్టించుకో లేదని కిషన్‌రెడ్డి ప్రశ్నించారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ మహిళలకు రిజర్వేషన్లు తీసుకువస్తుంటే కోడి గుడ్డు మీద ఈకలు పీకే ప్రయత్నం కాంగ్రెస్ నేతలు చేస్తున్నారని ఎద్దేవా చేశారు. 70 కోట్ల మంది మహిళల గౌరవాన్ని పెంచాలని.. వారికి హక్కులు కల్పించాలని రిజర్వేషన్లు తీసుకువస్తున్నామని చెప్పారు. తాము దక్షిణాదిలోనే ఉన్నామని.. ఎవరికీ అన్యాయం జరగకుండా మోదీ ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుందని వెల్లడించారు. మహిళలకు రిజర్వేషన్లు కల్పించాలంటే డీలిమిటేషన్ చేయాల్సిందేనని కిషన్‌రెడ్డి స్పష్టం చేశారు. రాహుల్ గాంధీ, కాంగ్రెస్ నేతలు మహిళా రిజర్వేషన్లకు సహకరించాలని కోరారు. పూర్తిస్థాయి సెన్సెస్ రావాలంటే రెండు సంవత్సరాల సమయం పడుతుందని.. మిడిమిడి జ్ఞానంతో మాట్లాడవద్దని హితవు పలికారు. వారానికి ఒకసారి ఢిల్లీకి సీఎం రేవంత్‌రెడ్డి ఎందుకు వెళ్తున్నారో తెలంగాణ ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఒక కార్పొరేషన్ పదవి ఇవ్వాలన్న ఢిల్లీకి కట్టలు మోయాలని విమర్శించారు. బీజేపీ విధానం అది కాదని చెప్పారు. సీఎం రేవంత్ రెడ్డి మాటలు ఆయన విజ్ఞతకే వదిలేస్తున్నామని కిషన్‌రెడ్డి పేర్కొన్నారు.

### వికసిత భారత్ లక్ష్య సాధనలో మినరల్స్ కూడా కీలకమే

**మినరల్ రంగంలో ఆత్మనిర్భరత భారత్‌పై ప్రత్యేక దృష్టి**

**కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి వెల్లడి**

ప్రపంచవ్యాప్తంగా క్రిటికల్ మినరల్స్ ప్రాముఖ్యం పెరుగుతోందని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి అన్నారు. 2047 వికసిత భారత్ లక్ష్యాన్ని సాధించడంలో మినరల్స్ కీలకమని చెప్పుకొచ్చారు. మినరల్ రంగంలో ఆత్మనిర్భరత సాధించడంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు కిషన్ రెడ్డి తెలిపారు. సోమవారం హెచ్ఐసీసీలో భారత ప్రభుత్వ గనుల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో 2వ విడత ఎక్స్‌ప్లోరేషన్ లైసెన్స్ వేలం, 7వ విడత క్రిటికల్ / స్ట్రాటజిక్ మినరల్ బ్లాక్స్ వేలం కార్యక్రమానికి కేంద్ర మంత్రి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కిషన్ రెడ్డి మాట్లాడుతూ.. జియోపాలిటిక్స్, క్లైమేట్ మార్పు, ఆర్థిక భద్రతలో ఈ మినరల్స్ కీలక పాత్ర పోషిస్తున్నాయని వివరించారు. ఇప్పటివరకు 46 బ్లాక్స్ వేలం విజయవంతంగా పూర్తి చేశామని కేంద్ర మంత్రి వెల్లడించారు. 7వ విడతలో 19 బ్లాక్స్‌ల వేలం ప్రారంభమైందన్నారు. మినరల్ ఎక్స్‌ప÷-లోరేషన్ లైసెన్స్ మొదటి విడత ప్రారంభమైందని.. త్వరలోనే 11 బ్లాక్స్‌లకు రెండో విడత లైసెన్స్ వేలం నిర్వహించనున్నట్లు తెలిపారు. తెలంగాణలో 2 వెనేడియం, టైటానియం బ్లాక్స్ సిద్ధం చేసినట్లు మంత్రి ప్రకటించారు. మైనింగ్ కార్యకలాపాలను వేగవంతం చేయడం కోసం చట్టాల్లో మార్పులు తీసుకొస్తున్నామని చెప్పారు. రాష్ట్రాలు స్వతంత్రంగా వేలం నిర్వహించే అవకాశం కల్పించనున్నట్లు చెప్పారు. పర్యావరణ అనుమతుల ప్రక్రియను సరళీకరించడం, 24 మినరల్స్‌పై కస్టమ్స్ డ్యూటీ రద్దు చేయడం, త్వరగా ఉత్పత్తి ప్రారంభించే కంపెనీలకు ప్రోత్సాహకాలు అందించడం వంటి చర్యలు తీసుకోనున్నట్లు కిషన్ రెడ్డి వివరించారు. స్క్రాప్ నుంచి మినరల్స్ రీసైక్లింగ్‌పై ప్రత్యేక దృష్టి సారిస్తున్నామన్నారు. విదేశాల్లో మైనింగ్ ప్రయత్నాలు చేపట్టామని తెలిపారు. రక్షణ రంగం, ఎలక్ట్రిక్ వెహికల్స్, గ్రీన్ ఎనర్జీకి క్రిటికల్ మినరల్స్ కీలకమని.. ప్రైవేట్ సంస్థలు భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. భారత్‌ను గ్లోబల్ మైనింగ్ లీడర్‌గా తీర్చిదిద్దడమే లక్ష్యంగా ప్రభుత్వం కృషి చేస్తోందని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి స్పష్టం చేశారు.

# భూ పరిపాలనకు కొత్త దిక్సూచి భూభారతి

**చరిత్రాత్మక చట్టానికి నేటితో ఏడాది పూర్తి**

**ఏడాదిలో 5కోట్లకు పైగా భూభారతి పోర్టల్ సందర్శన**

**70 లక్షల మంది పోర్టల్ ద్వారా లాగిన్**

**పాతసర్వే పద్ధతులకు స్వస్తి- రోవర్లతో సర్వే**

**ప్రతి సర్వే నెంబర్‌కు భూధార్**

**రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి**



**హైదరాబాద్,ఏప్రిల్13 :** ఆనాటి బిఆర్ఎస్ ప్రభుత్వంలో కుప్పకూలిన రెవెన్యూ వ్యవస్థను గౌరవ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారి నాయకత్వంలో పునర్నిర్మిస్తున్నామని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. భూహక్కుల పరిరక్షణ, పారదర్శకత, అవినీతి రహిత సేవలు సామాన్యుడికి సులభంగా అందేలా గత ఏడాది రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన భూభారతి చట్టం తెలంగాణ చరిత్రలో కీలక సంస్కరణగా నిలుస్తోందన్నారు. ఈనెల 14వ తేదీతో భూభారతి చట్టం అమలులోకి వచ్చి ఏడాది పూర్తవుతున్న సందర్భంగా సోమవారం నాడు సచివాలయంలోని తన కార్యాలయంలో మంత్రి గారు అధికారులతో భూభారతి చట్టంపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇది కేవలం ఒక చట్టానికి ఏడాది పూ- ర్తైన సందర్భం మాత్రమే కాదని, తెలంగాణ రాష్ట్రంలో భూహక్కుల రక్షణకు ప్రారంభమైన కొత్త శకానికి నాందిపలికిన రోజని వ్యాఖ్యానించారు. భూభారతి చట్టానికి ముందు ఆ తర్వాత ఉన్న పరిస్థితులపై అధికారులతో చర్చించారు. ఈ చట్టం తీసుకువచ్చే నాటికి ధరణి పోర్టల్ వల్ల తెలంగాణ ప్రజానీకం ఎదుర్కొన్న పరిస్థితులను ఈ సందర్భంగా మంత్రిగారు గుర్తు చేశారు. 'నాటి పరిస్థితిని పూర్తిగా మార్చాలన్న సంకల్పంతో పారదర్శకత, బాధ్యతాయుత, వేగం అనే మూడు ప్రధాన సూత్రాలతో రెవెన్యూ వ్యవస్థను ప్రజలకు చేరువచేస్తున్నాం. ఈ క్రమంలోనే చారిత్రాత్మకమైన భూభారతి చట్టాన్ని తీసుకువచ్చాం. ఈ చట్టం రాష్ట్రంలోని భూ పరిపాలనను పారదర్శకంగా సులభంగా మార్చింది. బిఆర్ఎస్ ప్రభుత్వ పాలనలో సరైన విధివిధానాలు లేకుండా తీసుకొచ్చిన 2020 ఆర్వోఆర్ చట్టం, ధరణి పోర్టల్ వల్ల లక్షలాది మంది ప్రజలు తమ భూముల హక్కుల విషయంలో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. భూమి తమదే అయినప్పటికీ హక్కులను నిరూపించుకునేందుకు అధికారుల, కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి ఉండేది. ఆనాటి పరిస్థితులను చూసి అధికారంలోకి వచ్చిన వెంటనే ధరణి పోర్టల్‌ను బంగాళాఖాతంలో కలుపుతామని ఇచ్చిన మాటను నిలబెట్టుకొని గత ఏడాది ఏప్రిల్ 14న డాక్టర్ బిఆర్ అంబేద్కర్ జయంతి రోజున గౌరవ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిగారి చేతుల మీదుగా భూభారతి పోర్టల్‌ను ఆవిష్కరించుకున్నాం. తెలంగాణ రైతాంగానికి భూ భద్రత కల్పించడంలో భూభారతి ఒక బలమైన ఆయుధంగా మారింది. భూ వివాదాలకు చరమగీతం పాడుతూ, సామాన్యుడికి రెవెన్యూ కార్యాలయాల చుట్టూ తిరిగే తిప్పలు తగ్గించడంలో ఈ ఏడాది కాలం ఒక గొప్ప ముందడుగుగా నిలిచింది. ఈ 12 నెలల కాలంలో భూభారతి పోర్టల్ పాత చిక్కుముడులను విప్పడంలో కీలక పాత్ర పోషించింది. ఈ పోర్టల్ ప్రారంభించిన ఏడాదిలోపే 5.20 కోట్లకు పైగా ప్రజలు ఈ పోర్టల్‌ను సందర్శించారు. సుమారు 67 లక్షల మంది పోర్టల్ ద్వారా లాగిన్ అయ్యారు. ప్రజల కోసం రెవెన్యూ శాఖ లో గణనీయమైన మార్పులు తెస్తున్నాం. రైతులకు పారదర్శకంగా సులభతరమైన సేవలు అందించడానికి రెవెన్యూ, సర్వే, స్టాంప్స్ / రిజిస్ట్రేషన్ విభాగాలను ఒకే గొడుగు కిందకు తీసుకువచ్చి కేంద్ర ప్రభుత్వం సంస్థ ఎన్.ఐ.సి.తో కలిసి రూపొందించిన ఇంటిగ్రేటెడ్ భూభారతి పోర్టల్‌ను ఈనెల 2వ తేదీ నుంచి ఐదు జిల్లాల్లోని ఐదు మండలాల్లో? ప్రయోగాత్మకంగా ప్రారంభించడం జరిగింది. ఇక్కడ ఎదురయ్యే మంచి చెడులను పరిగణనలోకి తీసుకొని అవసరమైన మార్పులు చేర్పులు చేసి వచ్చే నెలలో జిల్లాకు ఒక మండలంలో ప్రారంభిస్తాం. ఈ ఐదు మండలాల్లో కూడా ప్రతి సర్వే నెంబరుకు భూధార్ నెంబర్‌ను కేటాయిస్తాం. రాష్ట్రంలో భూ వివాదాలకు శాశ్వత పరిష్కారం చూపాలన్న సంకల్పంతో మా ప్రభుత్వం పనిచేస్తోంది. రాష్ట్రంలో నిజాం కాలం నుంచి 378 గ్రామాలను నక్షాలు లేవు. ఇందులో ఐదు గ్రామాలలో రీ సర్వే పూర్తి చేసి భూధార్ నెంబర్ కేటాయించాం. మిగిలిన 373 గ్రామాల్లో రోవర్స్ వంటి ఆధునిక సర్వే సాంకేతికతను ఉపయోగించి రీసర్వే పనులు కొనసాగిస్తున్నాం. ÷ల్లాకు 70 రెవెన్యూ గ్రామాలను గుర్తించి సర్వే చేపట్టబోతున్నాం. సర్వే అనంతరం హద్దులను గుర్తించి భూధార్ నెంబర్ ఇస్తాం. ఈ విధంగా రాష్ట్ర వ్యాప్తంగా దశల వారీగా సర్వే నిర్వహించాలని నిర్ణయించాం.

తెలంగాణ ప్రాంతంలో 1948 నాటికి సుమారు 40 లక్షల సర్వేనెంబర్లు వినియోగంలో ఉండగా అప్పటి నుంచి ఇప్పటివరకు ఈ 77 సంవత్సరాలలో 2కోట్ల 29 లక్షలకు చేరాయి. వీటన్నింటికీ భూధార్ నెంబర్ ఇవ్వడానికి ప్రణాళికలు తయారుచేస్తున్నాం. భూ సర్వేకు అవసరమైన సిబ్బందిని సమకూర్చుకోవడం జరిగింది. శిక్షణ ఇచ్చి 5,520 మంది లైసెన్స్‌డ్ సర్వేయర్లకు లైసెన్స్‌లు జారీ చేశాం. భూవిస్తీర్ణాన్ని బట్టి ప్రతి మండలానికి 4 నుంచి 6గురు సర్వేయర్లను నియమించాం. రాష్ట్రంలోని 10,984 రెవెన్యూ గ్రామాలను క్లస్టర్లుగా విభజించి జీపీవోలను నియమించడం జరిగింది. గొలుసులు, కర్రలు, క్రాస్ స్టాఫ్, మెజరింగ్ టేప్ వంటి పాత సర్వే పరికరాలకు స్వస్తి చెప్పి అత్యాధునిక యంత్రాలు, సాంకేతిక పరిజ్ఞానం వీలైనంత వరకు వినియోగించుకుంటున్నాం. ఇప్పటికే 411 రోవర్లను కొనుగోలు చేశాం. త్వరలో మరో 400 కొనుగోలు చేయబోతున్నాం. భూ భారతి పోర్టల్ ప్రారంభించిన గత ఏడాది ఏప్రిల్ 14 నుంచి ఇప్పటి వరకు 3.80 లక్షల పాస్ బుక్ లు జారీచేశాం.'అని వివరించారు

# గ్యాస్ సిలిండర్ల అక్రమ నిల్వలపై దాడులు

**రూ 1.50 కోట్ల విలువైన డొమెస్టిక్ సిలిండర్ల స్వాధీనం.**

**గత నెల రోజుల్లో 2,089 కేసులు నమోదు.**

**పౌరసరఫరాల శాఖ నిరంతర నిఘా**

**హైదరాబాద్,ఏప్రిల్13 :** గ్యాస్ సరఫరాలో గృహ వినియోగదారులకి ఎటువంటి ఇబ్బంది రాకుండా రాష్ట్ర పౌరసరఫరాల సంస్థ నిరంతరం మానిటరింగ్ చేస్తున్నది. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, రాష్ట్ర పౌర సరఫరాలు, నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఆదేశాల మేరకు గ్యాస్ సిలిండర్ల ను అక్రమ నిల్వ, పక్కదారి పట్టించే వారిపై అధికారులు నిఘా ఉంచి, ఆకస్మిక తనిఖీలు చేస్తున్నారు. డొమెస్టిక్ సిలిండర్ల సరఫరా ప్రక్రియ నిబంధనల ప్రకారం సకాలంలో జరిగేందుకు బుకింగ్స్ / డెలివరీలను కమాండ్ కంట్రోల్ ద్వారా ఆయా ఏజెన్సీలతో రోజువారీగా చెక్ చేస్తున్నారు. గత నెల రోజులుగా నిర్వహించిన దాడుల్లో అక్రమంగా తరలిస్తున్న, నిల్వ ఉంచిన 5,079 డొమెస్టిక్ సిలిండర్లు, మరో 70 చిన్న సిలిండర్లను విజిలెన్స్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. వీటి విలువ రూ 1 కోటి 50 లక్షలు ఉన్నది. ఈ సందర్భంగా 2,089 కేసులు నమోదు చేశారు. వీరిపై చట్ట ప్రకారం చర్యలు చేపట్టారు. గ్యాస్ సిలిండర్ల అక్రమ నిల్వ, తరలింపు, డెలివరీ లో జాప్యంపై రాష్ట్ర పౌర సరఫరాల సంస్థ ఏర్పాటు చేసిన టోల్ ఫ్రీ నెంబర్:1967 కు ఫిర్యాదు చేయాలని ప్రభుత్వం సూచించింది.

# ఓటుకు..నోటుకు లంకె పెట్టినట్లు అనుకున్నారా

**మహిళా బిల్లు, డీలిమిటేషన్‌తో వచ్చే నష్టమేమిటో**

**సిఎం వ్యాఖ్యలపై మండిపడ్డ మండి సంజయ్**



**కరీంనగర్,ఏప్రిల్13 :** డీలిమిటేషన్, మహిళా రిజర్వేషన్ల బిల్లులతో జరిగే నష్టమేమిటో చెప్పే దమ్ములేక రాజకీయం చేయాలనుకంటున్నారా అని సిఎం రేవంత్‌రెడ్డిని కేంద్రమంత్రి బండి సంజయ్ ప్రశ్నించారు. డీలిమిటేషన్‌లో భాగంగా ప్రతి రాష్ట్రాని 50 శాతం సీట్ల పెంచితే దక్షిణాదికి జరిగే నష్టమేంటని.. ప్రజల్లో లేనిపోని భయాందోళనలు సృష్టించి విభజించాలనుకుంటున్నారా అని నిలదీశారు. అసలు.. మీరు చెప్పే శాస్త్రీయత ఏమిటి..? డబ్బు సమకూర్చే వాళ్లకే ప్రాధాన్యత ఇవ్వాలని చెబుతున్నారా అని ప్రశ్నించారు. డబ్బుకు, ఓటుకు, సీటుకు లింకు పెడతారా..? లక్ష కోట్లు ఉన్న మీ కుటుంబానికి లక్ష ఓట్లు ఇవ్వాలా..? డబ్బులేని పేదవాడికి ఓటు హక్కు కల్పించొద్దా అని ప్రశ్నల వర్షం కురిపించారు. ముంబయికి, ఢిల్లీకి మాత్రమే అత్యధిక సీట్లు ఉండాలా.. వెనుకబడ్డ ఆదిలాబాద్, పాలమూరు జిల్లాలకు సీట్లు పెంచాల్సిన అవసరమే లేదా అని నిలదీశారు. మీ హైబ్రీడ్ మోడల్ అంటే ఇదేనా అని అన్నారు. ప్రతి అంశాన్ని రాజకీయం చేయడం తగదని చురకలంటించారు. ఇకపోతే చావైనా, బతుకైనా కరీంనగరేనని.. తుది శ్వాస వరకు బీజేపీలోనే ఉంటానని కేంద్ర మంత్రి బండి సంజయ్ స్పష్టం చేశారు. బండి సంజయ్ సైతం డాక్టర్ లక్ష్మణ్ మాదిరిగా ఏదో ఒక రాష్ట్రానికి వలస పోక తప్పదంటూ సీఎం రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలపై కేంద్ర మంత్రి బండి సంజయ్ స్పందించారు. ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేశారు. 'వలసపోవడానికి నేను అవకాశవాదిని కాదు. రేవంత్ రెడ్డిని అంతకంటే కాదు. చావైనా బతుకైనా కరీంనగరంతోనే... నా రక్తం కాషాయమే. నేను చనిపోతే నా శవంపై కప్పేది కూడా కాషాయ జెండానే. ఆ సన్నివేశం చూడటానికైనా రేవంత్ రెడ్డి నిండు నూరేళ్లు బతికి ఉండాలని కోరుకుంటున్నట్లు పేర్కొన్నారు.

# మహిళా రిజర్వేషన్లపై విమర్శలు తగవు

**ప్రతి ఒక్కరూ స్వాగతించాల్సిందే**

**డి లిమిటేషన్‌తో ఎవ్వరికీ అన్యాయం జరగదు**

**సిఎం రేవంత్ వ్యాఖ్యలపై ఎంపి డికె అరుణ**



**హైదరాబాద్,ఏప్రిల్13 :** మహిళా రిజర్వేషన్లు, డీలిమిటేషన్‌ను దేశ ప్రజలు స్వాగతిస్తున్నారని ఎన్డీయే కూటమి పార్టీల నేతలే చెబుతున్నారని బిజెపి ఎంపి డికె అరుణ అన్నారు. మహిళా రిజర్వేషన్ అంశానికి ప్రతిపక్ష పార్టీలు మద్దతు ఇస్తూనే డీలిమిటేషన్‌పై విమర్శలు చేస్తున్నాయి. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కూడా విమర్శలు చేయడం సరికాదని ఆమె వ్యాఖ్యలు చేశారు. దక్షిణాది, చిన్న రాష్ట్రాలకు అన్యాయం జరుగుతుందని సీఎం రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలపై బీజేపీ ఎంపీ డీకే అరుణ తీవ్రంగా స్పందించారు. మహిళా రిజర్వేషన్లు, పార్లమెంటు, అసెంబ్లీలలో మహిళల ప్రాతినిధ్యం పెంచడానికి సాయపడుతుందని డీకే అరుణ తెలిపారు. మహిళా రిజర్వేషన్ల అంశంపై రాజకీయం చేయవద్దని ప్రతిపక్ష పార్టీలకు ఆమె సూచించారు. ఈ రిజర్వేషన్ల ద్వారా చట్టసభల్లో మహిళలకు సమాన అవకాశాలు లభిస్తాయని, దీనికి పార్టీలకు అతీతంగా ప్రతి ఒక్కరి మద్దతును అవసరమని ఆమె అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో ఉన్న ప్రస్తుత పరిస్థితుల్లో, ఇలాంటి చట్టాలు మహిళలకు చాలా మేలు చేస్తాయని ఎంపీ తెలిపారు. రిజర్వేషన్లతో చట్టసభల్లో మహిళల ప్రాతినిధ్యం పెరుగుతుందని డీకే అరుణ అన్నారు. అలానే డీలిమిటేషన్‌పై కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. నియోజకవర్గాల పునర్విభజనపై సీఎం రేవంత్ రెడ్డికి అవగాహన లేదన్నారు. తాము కూడా దక్షిణాదిలోనే ఉన్నామని, అన్యాయం జరగనివ్వబోమని చెప్పారు. 2011 జనాభా లెక్కల ప్రకారమే డీలిమిటేషన్ జరుగుతుందని, ఈ ప్రక్రియకు రెండేళ్ల సమయం పడుతుందని అన్నారు. డీలిమిటేషన్, మహిళల రిజర్వేషన్లను రాజకీయం చేయొద్దని కాంగ్రెస్‌ను కోరుతున్నాని తెలిపారు. ఈ మొత్తం వ్యవహారాన్ని రేవంత్‌కే వదిలేస్తున్నాని కిషన్‌రెడ్డి అన్నారు.

# సమ్మెపై కార్మికులు ఆలోచించాలి: పొన్నం

**హైదరాబాద్,ఏప్రిల్13 :** తెలంగాణ ఆర్టీసీ కార్మికుల సమ్మెపై మంత్రి పొన్నం ప్రభాకర్ స్పందించారు. రెండు అంశాలపై ప్రభుత్వం కమిటీ వేసిందని తెలిపారు. కమిటీ నుంచి పూర్తి వివరాలు వచ్చిన తర్వాత కార్మికులకు అనుగుణంగా నిర్ణయం తీసుకుంటామని చెప్పారు. ఆర్టీసీ విలీనం, యూనియన్ అంశంపై కమిటీ వేసినట్లు తెలిపారు. మిగతా అంశాలు క్లియర్ చేయడానికి తాము సిద్ధంగా ఉన్నట్లు స్పష్టం చేశారు. ఆర్టీసీ కార్మికులు ఆలోచించాలని.. తొందర పడవద్దని మంత్రి పొన్నం విజ్ఞప్తి చేశారు. సమ్మెకు సిద్ధమవుతున్న ఆర్టీసీ కార్మికులు.. లేబర్ కమిషనర్‌తో చర్చలు జరపాలని నిర్ణయించారు. లేబర్ కమిషనర్ కార్యాలయం వద్దకు భారీగా ఆర్టీసీ కార్మికులు చేరుకోవాలని జేఏసీ పిలుపునిచ్చింది. చర్చల అనంతరం సమ్మె తేదీ ప్రకటించే అవకాశం ఉంది . ప్రభుత్వం తమ డిమాండ్లపై స్పందించకపోతే ఈనెల 20 నుంచి సమ్మెకు వెళ్లాలని ఆర్టీసీ కార్మికులు యోచిస్తున్నట్లు సమాచారం. మార్చి 13న యాజమాన్యానికి ఆర్టీసీ జేఏసీ సమ్మె నోటీసు ఇచ్చిన విషయం తెలిసిందే.

# బిఆర్ఎస్‌తో పొత్తు ఇక్కడికే పరిమితం

**ఖానాపూర్ సభలో బిజెపి అధ్యక్షుడు రాంచంద్రరావు**

**నిర్మల్,ఏప్రిల్13 :** పొత్తులపై తెలంగాణ బీజేపీ చీఫ్ రాంచందర్ రావు సంచలన వ్యాఖ్యలు చేశారు. సోమవారం ఖానాపూర్ మున్సిపల్ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి విజయం సాధించడాన్ని పురస్కరించుకుని నిర్మల్‌లో ఏర్పాటు చేసిన విజయోత్సవ సభలో ఆయన మాట్లాడుతూ.. భవిష్యత్తులో బీజేపీ ఏ పార్టీతోనూ పొత్తు పెట్టుకోదని స్పష్టం చేశారు. ఖానాపూర్‌లో బీఆర్ఎస్‌తో జరిగిన పొత్తు స్థానిక నాయకుల మధ్య మాత్రమే జరిగిందని.. పార్టీ స్థాయిలో కాదని వివరించారు. ఖానాపూర్ మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ నాయకులు, పోలీసుల బలంతో గుండాయిజం చేసినా ప్రజలు బీజేపీకి మద్దతు ఇచ్చి పట్టం కట్టారని అన్నారు. కాంగ్రెస్ అధికారబలం ఖానాపూర్‌లో పనిచేయలేదని ఆయన పేర్కొన్నారు. తలసరి ఆదాయం ఉంటేనే అసెంబ్లీ సీట్లు పెంచాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు బాధాకరమని రాంచందర్ రావు విమర్శించారు. ఈ వ్యాఖ్యలు పేదవారిని, వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధిని అణచివేయాలనే ఉద్దేశంతో చేసినట్లుగా ఉన్నాయని ఆయన అభిప్రాయపడ్డారు. 50 ఏళ్లు పాలించిన కాంగ్రెస్ పార్టీ ఎన్నడూ మహిళల హక్కుల గురించి మాట్లాడలేదని వ్యాఖ్యానించారు. మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పించేందుకు బీజేపీ నిరంతరం కృషి చేస్తోందని తెలిపారు. వికసిత్ భారత్ లక్ష్యంతో ఏప్రిల్ 16న మహిళా రిజర్వేషన్ కోసం ప్రత్యేక బిల్లును ప్రవేశపెట్టనుందని తెలంగాణ బీజేపీ చీఫ్ రాంచందర్ రావు వెల్లడించారు.

# పశ్చిమాసియాలో మళ్లీ ఉద్రిక్తతలు

## క్రూడాయిల్ బ్యారెల్ ధర 103 డాలర్లకు చేరిక

## భారీ నష్టాలతో ముగిసిన స్టాక్ మార్కెట్లు

**న్యూఢిల్లీ :** పశ్చిమాసియాలో మళ్లీ ఉద్రిక్తతలు మొదలు కావడంతో ముడి చమురు ధరలు భగ్గుమన్నాయి. బ్రెంట్ క్రూడాయిల్ బ్యారెల్ ధర 103 డాలర్లకు చేరుకుంది. హోర్ముజ్‌ను దిగ్బంధిస్తామని ట్రంప్ ప్రకటించడం మరింత ఆందోళన కలిగిస్తోంది. ఈ నేపథ్యంలో అంతర్జాతీయ మార్కెట్లు డీలాపడ్డాయి. మరోవైపు డాలర్‌తో పోల్చుకుంటే రూపాయి మరింత పతనమైంది. ఇన్ని వ్యతిరేకతల నేపథ్యంలో సోమవారం సూచీలు నష్టాలతో ప్రారంభమయ్యాయి. నష్టాలతోనే రోజును ముగించాయి. గత సెషన్ ముగింపు (76,794)తో పోల్చుకుంటే సోమవారం ఉదయం దాదాపు 1600 పాయింట్ల నష్టంతో మొదలైన సెన్సెక్స్ రోజంతా నష్టాల్లోనే కదలాడింది. అయితే ఉదయం భారీ నష్టాలను చవి చూసిన సూచీలు మధ్యాహ్నం తర్వాత కాస్త కోలుకున్నాయి. చివరకు సెన్సెక్స్ 702 పాయింట్ల నష్టంతో 76,847 వద్ద రోజును ముగించింది. మరో వైపు నిఫ్టీ కూడా సెన్సెక్స్ బాటలోనే కదలాడింది. చివరకు 207 పాయింట్ల నష్టంతో 23,842 వద్ద స్థిరపడింది. సెన్సెక్స్, నిఫ్టీలో జేఎస్‌డబ్ల్యూ ఎనర్జీ, ఎమ్‌సీఎక్స్ ఇండియా, వోల్టాస్, సోలార్ ఇండస్ట్రీస్, అదానీ పవర్ మొదలైన షేర్లు లాభాలు ఆర్జించాయి. ఐచర్ మోటార్స్, చోలా ఇన్వెస్ట్‌మెంట్, మారుతీ సుజుకీ, నిప్పాన్, ఏపీఎల్ అపోలో మొదలైన షేర్లు నష్టాలు మూటగట్టుకున్నాయి. బ్యాంక్ నిఫ్టీ 307 పాయింట్లు నష్టపోయింది. నిఫ్టీ మిడ్ క్యాప్ ఇండెక్స్ 330 పాయింట్లు కోల్పోయింది. డాలర్‌తో పోల్చుకుంటే రూపాయి మారకం విలువ 93.38గా ఉంది.

# ఢిల్లీ లిక్కర్ స్కామ్ కేసు

## దర్యాప్తు సంస్థల తీరుపై మండిపడ్డ కేజ్రీవాల్

**న్యూఢిల్లీ :** ఢిల్లీ లిక్కర్ స్కాం కేసు విచారణనుంచి జస్టిస్ స్వర్ణకాంత శర్మను తొలగించాలని కోరుతూ ఢిల్లీ మాజీ ముఖ్యమంత్రి కేజ్రీవాల్ హైకోర్టులో పిటిషన్ వేసిన సంగతి తెలిసిందే. సోమవారం హైకోర్టు పిటిషన్‌పై విచారణ జరిపింది. కేజ్రీవాల్ స్వయంగా తన వాదనలు వినిపించారు. విచారణ ప్రక్రియలో పక్షపాతం ఉండవచ్చంటూ ఆందోళన వ్యక్తం చేశారు. విచారణ సందర్భంగా సాక్షుల వాంగ్మూలాలపై చేసిన వ్యాఖ్యలు తనను దోషిగా, అవినీతిపరుడిగా చిత్రీకరించేలా ఉన్నాయని కేజ్రీవాల్ కోర్టుకు తెలిపారు. దర్యాప్తు సంస్థలపై కూడా కేజ్రీవాల్ సంచలన ఆరోపణలు చేశారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్, సెంట్రల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ వంటి దర్యాప్తు సంస్థలు మొదట సాక్షులను అరెస్టు చేసి.. ఆ తర్వాత ఇతరులను ఇరికించేలా వారి నుండి బలవంతంగా వాంగ్మూలాలను తీసుకుంటున్నాయని అన్నారు. కాగా, ఈడీ నమోదు చేసిన రెండు వేర్వేరు కేసుల్లో కేజ్రీవాల్‌ను రౌస్ ఎవెన్యూ కోర్టు ఇటీవల నిర్దోషిగా ప్రకటించింది. దీనిని ఎన్‌ఫోర్స్‌మెంట్ డెరెక్టరేట్ హైకోర్టులో సవాలు చేసింది. ఈడీ పిటిషన్‌పై జస్టిస్ స్వర్ణకాంత శర్మ నేతృత్వంలోని ఏకసభ్య ధర్మాసనం ఏప్రిల్ 6వ తేదీన విచారణ జరిపింది. ఈ సందర్భంగా, కేజ్రీవాల్ సహా పలువురు దాఖలు చేసిన రెక్యూసల్ పిటిషన్లపై సమాధానం ఇవ్వాలని సీబీఐకి ధర్మాసనం నోటీసులు జారీ చేసింది. తదుపరి విచారణను ఈ నెల 13వ తేదీకి వాయిదా వేసింది.

# ఆశాకు క్రికెటర్ సచిన్ నివాళి

**ముంబై :** ఆశా భౌతికకాయానికి భారత క్రికెట్ దిగ్గజం సచిన్ టెండూల్కర్, అతడి భార్య అంజలితో కలిసి నివాళులు అర్పించాడు. ఆశా భోస్లేతో సచిన్ కుటుంబానికి చాలా కాలంగా అత్యంత సన్నిహిత సంబంధం ఉంది. ఆమె భౌతిక కాయానికి నివాళులు అర్పిస్తూ సచిన్ కంటతడి పెట్టుకున్నాడు. అక్కడే ఉన్న ఆమె కుటుంబ సభ్యులతో మాట్లాడి సంతాపం తెలిపాడు. అతడితో పాటు ఆశా భోస్లేను చివరిసారిగా చూసేందుకు వచ్చిన సినీ, రాజకీయ ప్రముఖులు కూడా కన్నీటి వీడ్కోలు పలికారు. సంగీత ప్రపంచంలో ఆమె సేవలను స్మరించుకుంటూ దేశవ్యాప్తంగా ప్రముఖులు నివాళులు అర్పించారు. ప్రముఖ గాయని ఆశా భోస్లే ఆదివారం కన్నుమూసిన సంగతి తెలిసిందే. ముంబైలోని బ్రీచ్ క్యాండీ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ 92 ఏళ్ల వయసులో ఆమె కన్నుమూశారు. ఆశా అంత్యక్రియలు సోమవారం సాయంత్రం ముంబైలోని శివాజి పార్క్‌లో జరిగాయి. ఆమె భౌతికకాయాన్ని సందర్శనార్థం ముంబైలోని నివాసంలో ఉంచగా పలువురు ప్రముఖులు సందర్శించి నివాళి అర్పించారు. .

# యూపిలో ఘోర రోడ్డు ప్రమాదం

## బస్సు, ట్రక్కు ఢీకొన్న ప్రమాదంలో ఆరుగురు మృతి

**లక్నో :** ఉత్తరప్రదేశ్ లో ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. హాపూర్ ప్రాంతంలో బస్సు, ట్రక్కు ఢీకొన్న ఘటనలో ఆరుగురు ప్రాణాలు కోల్పోగా, ఏడుగురు తీవ్రంగా గాయపడ్డారు. పెళ్లి వేడుక నుంచి తిరిగి వస్తున్న ప్రయాణికులతో వెళ్తున్న బస్సు ముందున్న ట్రక్కును ఢీకొట్టడంతో ఈ ప్రమాదం సంభవించినట్లు పోలీసులు తెలిపారు. ఘటన సమాచారం అందిన వెంటనే అధికారులు సంఘటన స్థలానికి చేరుకుని సహాయక చర్యలు ప్రారంభించారు. ఎస్పీ జ్ఞానంజయ్ సింగ్ వివరాల ప్రకారం, ఆరుగురు అక్కడికక్కడే మరణించారు. గాయపడిన వారిని సమీప ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ప్రమాదానికి గురైన ట్రక్కును రహదారి నుంచి తొలగించి, ట్రాఫిక్‌ను పునరుద్ధరించారు. మృతుల కుటుంబ సభ్యులు సంఘటన స్థలానికి చేరుకుని విషాదంలో మునిగిపోయారు. బస్సులో ప్రయాణిస్తున్న 12 మందిని గుర్తించగా, ఒక వ్యక్తి ఆచూకీ ఇంకా తెలియరాలేదని అధికారులు తెలిపారు. బస్సు డ్రైవర్ నిర్లక్ష్యమే ప్రమాదానికి కారణమై ఉండొచ్చని పోలీసులు అనుమానిస్తున్నారు.

# పాదచారులపై దూసుకెళ్లిన ట్రక్కు

## ఏడుగురు వ్యక్తులు అక్కడిక్కడే మృతి

**రాజ్‌కోట్ :** ఓ ట్రక్కు అదుపుతప్పి రోడ్డు పక్కన నడుచుకుంటూ వెళ్తున్న యాత్రికులపైకి దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో ఏడుగురు అక్కడికక్కడే మరణించారు. వారిలో ఆరుగురు యాత్రికులు కాగా.. మరో వ్యక్తి రోడ్డు పక్కన తన వాహనం టైరు మారుస్తున్న డంపర్ డ్రైవర్. యాత్రికులు రాజస్థాన్‌లోని రాజ్‌కోట్ లోని గద్కా గ్రామం నుంచి దేకావాలా లోని మహదేవ్ ఆలయానికి వెళ్తుండగా.. సోమవారం తెల్లవారుజామున లఖ్తర్‌-విరామ్‌గామ్ రహదారిపై భాస్కర్‌పారా సమీపంలో ప్రమాదం జరిగింది. రాజ్‌కోట్‌లోని గద్కా గ్రామం నుంచి దేకావాలాలోని మహాదేవ్ ఆలయానికి నడుచుకుంటూ వెళ్తున్న యాత్రికులు.. మార్గమధ్యలో భాస్కర్‌పారా సమీపంలో ఓ వ్యక్తి రోడ్డుపై ఆగిపోయిన డంపర్‌కు టైరు మారుస్తున్నాడు. యాత్రికులు ఆ డంపర్‌ను దాటుతున్న సమయంలో వెనుక నుంచి వేగంగా దూసుకొచ్చిన ట్రక్కు వారిని ఢీకొట్టింది. ఈ ఘటనలో ఆరుగురు యాత్రికులు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. వారిలో ఐదుగురు మహిళలు, ఒక పురుషుడు ఉన్నారు. అదేవిధంగా డంపర్ టైరు మారుస్తున్న డ్రైవర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. అతడిని ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ ప్రాణాలు కోల్పోయాడు.దాంతో మొత్తం మృతుల సంఖ్య ఏడుకు చేరింది. ప్రమాద సమాచారం అందుకున్న వెంటనే పోలీసులు ఘటనా ప్రాంతానికి చేరుకున్నారు. మృతదేహాలను పోస్టుమార్టానికి తరలించారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

# పశ్చిమాసియాలో మళ్లీ యుద్ధమేఘాలు

### ఇరాన్‌పై దాడికి ట్రంప్, ఇజ్రాయిల్ సమాలోచనలు

### ఎప్పుడు ఏం జరుగుతుందో అన్న ఆందోళన



**వాషింగ్టన్ :** అమెరికా-ఇరాన్ మధ్య శాంతి చర్చలు విఫలమవడంతో పశ్చిమాసియా మళ్లీ నివురుగప్పిన నిప్పులా మారింది. ఏ క్షణాన ఏం జరుగుతుందో అర్థం కాని పరిస్థితి నెలకొంది. మరోవైపు, ఇరాన్‌పై మళ్లీ దాడులు ప్రారంభించేందుకు అమెరికా, ఇజ్రాయెల్ సిద్ధమవుతున్నట్లు వార్తలు రావడం ఆందోళన కలిగిస్తోంది. హర్మ్యూజ్ జలసంధిని దిగ్బంధిస్తామని అమెరికా సెంట్రల్ కమాండ్ ఇప్పటికే ప్రకటించిన సంగతి తెలిసిందే. దీంతో పాటు ఇరాన్‌పై పరిమిత స్థాయిలో సైనిక దాడులను పునరుద్ధరించేలా అగ్రరాజ్య అధ్యక్షుడు ట్రంప్ సలహాదారులు ప్రణాళికలు రచిస్తున్నట్లు తెలుస్తోంది. ఈ మేరకు విశ్వసనీయ వర్గాలను ఉటంకిస్తూ పలు అంతర్జాతీయ మీడియా కథనాలు వెల్లడించాయి. అయితే, ఈ దాడులకు ట్రంప్ అంగీకరిస్తారా? లేదా అనేదానిపై ఇంకా స్పష్టత లేదు. ఇరాన్ (ఎసజీని)ను నలువైపులా నిర్బంధించి, హర్మ్యూజ్ జలసంధిపై నియంత్రణ తెచ్చుకోవాలని ట్రంప్ భావిస్తున్నట్లు సమాచారం. మిత్ర దేశాలతో కలిసి ఈ మార్గంలో ప్రయాణించే నౌకలకు భద్రత కల్పించే అంశంపై అమెరికా అధ్యక్షుడు చర్చలు జరుపుతున్నట్లు తెలుస్తోంది. అటు, ఇజ్రాయెల్ డిఫెన్స్ ఫోర్సెస్ కూడా ఇరాన్‌పై దాడులు సిద్ధమవుతున్నట్లు సమాచారం. ఎలాంటి పరిస్థితులనైనా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలని ఐడీఎఫ్ చీఫ్ ఆఫ్ స్టాఫ్ లెఫ్టినెంట్ జనరల్ ఇయాల్ జమీర్ తన సైన్యాన్ని ఆదేశించినట్లు ఇజ్రాయెల్ మీడియా కథనాలు పేర్కొన్నాయి. ఇరాన్‌పై దాడుల పునరుద్ధరణ విషయంలో ట్రంప్ నిర్ణయం కోసం ఇజ్రాయెల్ ఎదురుచూస్తున్నట్లు ఆ కథనాలు తెలిపాయి. అయితే, ఈలోగా టెహ్రాన్ తమపై దాడి చేస్తే మాత్రం ప్రతిస్పందన తీవ్రంగా ఉంటుందని ఐడీఎఫ్ హెచ్చరిస్తోంది. ఇదిలా ఉండగా.. యూఎస్-ఇరాన్ చర్చలు విఫలం కావడంతో పశ్చిమాసియాలో మరోసారి ఉద్రిక్తతలు చెలరేగాయి. ఇరాన్ పోర్టుల నుంచి నౌకలు హోర్ముజ్ మీదుగా రాకపోకలు సాగించకుండా నేటి సాయంత్రం 7.30 (భారత కాలమానం ప్రకారం) నిర్బంధం విధిస్తామని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించారు. దీంతో పాటు ఇరాన్‌పై యూఎస్, ఇజ్రాయెల్‌లు మళ్లీ దాడులు చేసేందుకు ప్రణాళికలు రచిస్తున్నట్టు అంతర్జాతీయ మీడియాలో కథనాలు వెలువడ్డాయి.అణు కార్యక్రమాన్ని వదులుకునేలా ఇరాన్‌పై ఒత్తిడి తెచ్చేందుకు ఇజ్రాయెల్ దాడులను ప్లాన్ చేస్తున్నట్టు మీడియాలో కథనాలు వెలువడ్డాయి. ఆర్మీ సిద్ధంగా ఉండాలని ఇప్పటికే ఇజ్రాయెల్ రక్షణ దళం చీఫ్ లెఫ్టినెంట్ జనరల్ జమీర్ ఆదేశించారు. మరోవైపు, ఇరాన్‌పై పరిమిత స్థాయిలో దాడులు చేసేందుకు ట్రంప్, ఆయన సలహాదారులు యోచిస్తున్నట్టు తెలుస్తోంది. ఇరాన్‌ను అన్ని వైపుల నుంచి దిగ్బంధించి చర్చల్లో ప్రతిష్టంభనను తొలగించాలనేది యూఎస్ ప్రభుత్వం ఉద్దేశమని కథనాలు వెలువడ్డాయి. ఈ దిశగా నాటో దేశాలను కూడా రంగంలోకి దింపేందుకు అమెరికా ప్రభుత్వం ప్రయత్నిస్తున్నట్టు తెలుస్తోంది. ఇప్పటికే హోర్ముజ్ మీదుగా నౌకల రాకపోకలను ఇరాన్ నిలిపివేసిన విషయం తెలిసిందే. హోర్ముజ్ జలాల్లోకి యూఎస్ యుద్ధ నౌకలు వస్తే దాడులు తప్పవని హెచ్చరించింది. చర్చలు విఫలం కావడానికి అమెరికానే కారణమని తేల్చి చెప్పింది. యూఎస్ పెట్టిన అసమంజసమైన డిమాండ్స్ కారణంగానే చర్చల్లో పీటముడి పడిందని పేర్కొంది. అణు కార్యక్రమం వదులుకునే దిశగా ఇరాన్ నుంచి స్పష్టమైన హామీలు రాలేదని యూఎస్ ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ పేర్కొన్నారు.

### అమెరికా ట్యాంక్ విమానానికి తూట్లు

ఎంతో శక్తిమంతమైన, అధునాతనమైన అమెరికా యుద్ధ విమానాలకు పశ్చిమాసియాలో గట్టి ఎదురుదెబ్బలు తగులుతున్నాయి. అమెరికా ఎంతో గొప్పగా చెప్పుకునే వైమానిక దళానికి ఇరాన్ యుద్ధంలో భారీ నష్టం సంభవించింది. పలు యుద్ధ విమానాలు ధ్వంసమయ్యాయి. వాటిల్లో కేసీ-135ఆర్ ట్యాంకర్ విమానం కూడా ఒకటి.తాజాగా ఓ కేసీ-135ఆర్ ట్యాంకర్ విమానం యూకేలోని ఆర్ఏఎఫ్ మిడ్లెన్ హాల్ ఎయిర్‌బేస్‌లో ల్యాండ్ అయింది. ఆ విమానానికి చాలా తూట్లు పడ్డాయి. విమానం పై భాగంలో మరమ్మత్తులు చేసిన గుర్తులు కూడా కనిపించాయి. యూకే ఏవియేషన్ ఫొటోగ్రాఫర్ ఆండ్రూ మెక్‌కెల్వీ ఈ వీడియోను సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. గత నెలలో సౌదీ అరేబియాలోని అమెరికా వైమానిక స్థావరంపై ఇరాన్ క్షిపణి దాడులకు పాల్పడిన సంగతి తెలిసిందే. ఆ దాడుల్లో ఐదు కేసీ-135ఆర్ ట్యాంకర్ విమానాలు దెబ్బతిన్నాయి. తాజాగా యూకేలో ల్యాండ్ అయిన విమానం ఆ అయిదింటిలో ఒకటి అయి ఉండొచ్చని తెలుస్తోంది.

## హోర్ముజ్‌పై ట్రంప్ వ్యాఖ్యలు

### దిగ్బంధిస్తే తీవ్ర పరిణామాలు

### ఘాటుగా హెచ్చరికలు చేసిన ఇరాన్



హోర్ముజ్‌ను దిగ్బంధిస్తామన్న అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ హెచ్చరిక లపై ఇరాన్ మరోసారి ఘాటుగా స్పందించింది. హోర్ముజ్ ఇప్పటికీ తమ నియంత్రణలోనే ఉందని పేర్కొంది. శత్రువులు ఏ చిన్న పొరపాటు చేసినా ప్రమాదం తప్పదని హెచ్చరించింది. అంతకుముందు ఇరాన్ సైనిక దళం (ఐఆర్‌జీసీ) కూడా ట్రంప్‌కు గట్టి వార్నింగ్ ఇచ్చిన విషయం తెలిసిందే. హోర్ముజ్ వైపు వచ్చే యుద్ధ నౌకలపై దాడి చేస్తామని హెచ్చరించింది. పౌర నౌకల రాకపోకలకు మాత్రం ఎలాంటి ఇబ్బందీ ఉండదని భరోసా ఇచ్చింది. యుద్ధ నౌకలు వస్తే మాత్రం కాల్పుల విరమణను ఉల్లంఘించినట్టేనని స్పష్టం చేసింది. ఇక యూఎస్‌తో చర్చలు విఫలం కావడంపై ఇరాన్ మంత్రి అరాగ్చీ ఎక్స్ వేదికగా కీలక వ్యాఖ్యలు చేశారు. 47 ఏళ్ల తరువాత జరిగిన అత్యున్నత స్థాయి చర్చలకు తాము సదుద్దేశంతో వెళ్లామని చెప్పారు. ఒప్పందం అంగుళం దూరంలో ఉండగా యూఎస్ తన లక్ష్యాలను, ఉద్దేశాలను మార్చుకుందని ఆరోపించారు. మునుపటి అనుభవాల నుంచి ఎలాంటి గుణపాఠాలను అమెరికా నేర్చుకోలేదని అన్నారు. మంచి భావాలుంటే చివరకు మంచే జరుగుతుందని అన్నారు. మనసులో శత్రుత్వం ఉంటే తుదకు అదే మిగులుతుందని ఎక్స్ వేదికగా పోస్టు పెట్టారు. సోమవారం హోర్ముజ్‌లో నౌకల ట్రాఫిక్ స్తంభించిపోయిందని లాయిడ్స్ లిస్ట్ ఇంటెలిజెన్స్ అనే మారిటైమ్ సంస్థ తాజాగా పేర్కొంది. హోర్ముజ్‌ను దిగ్బంధిస్తామన్న ట్రంప్ ప్రకటన తరువాత నౌకల రాకపోకలు నిలిచిపోయాయని పేర్కొంది. ఎలాంటి ఒప్పందం లేకుండా ఇరాన్‌తో చర్చలు ముగియడంపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోసారి స్పందించారు. గతంలో కుదిరిన కాల్పుల విరమణ ఒప్పందం మాత్రం కొనసాగుతోందని అన్నారు. ఇరాన్ మళ్లీ చర్చలకు వస్తుందా? రాదా? అనేది తనకు ఇక అనవసరమని కూడా చెప్పారు. ఇప్పటికే ఇరాన్ పరిస్థితి దిగజారిందని, మిలిటరీ ధ్వంసమైపోయిందని చెప్పారు. శాంతి చర్చలు విఫలమవడానికి అమెరికానే కారణమని ఇరాన్ ఆరోపించింది. యుద్ధాన్ని ముగించేందుకు అమెరికాతో ఇరాన్ చిత్తశుద్ధితో సంప్రదింపులు చేసింది. కానీ, ఇస్లామాబాద్ ఒప్పందానికి కొన్ని అంగుళాల దూరంలోనే చర్చలు కుప్పకూలాయి. అతివాద భావజాలం, లక్ష్యాలు మారడం, నిర్బంధం వంటివి మాకు ఎదురయ్యాయి. మంచి చేస్తే మంచి జరుగుతుంది. చెడు చేయాలని చూస్తే శత్రుత్వమే మిగులుతుందని ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాగ్చి పోస్ట్ చేశారు.

# మరోమారు ఎదురు కాల్పులు

### మహిళా మావోయిస్టు నాయకురాలు మృతి

### అడవుల్లో కొనసాగుతున్న కూంబింగ్



**రాయ్‌పూర్ :** ఛత్తీస్‌గఢ్‌లో భద్రతా దళాలు, మావోయిస్టుల మధ్య జరిగిన ఎదురుకాల్పుల్లో మహిళా మావోయిస్టు కమాండర్ రూపీ మృతి చెందారు. కాంకేర్ జిల్లాలోని ఛోటే బెట్టియా అటవీ ప్రాంతంలో ఈ ఘటన చోటుచేసుకుంది. రూపీపై రూ.5 లక్షల బహుమతి ప్రకటించబడినట్లు అధికారులు తెలిపారు. మావోయిస్టులు ఉన్నారనే విశ్వసనీయ సమాచారం ఆధారంగా భద్రతా దళాలు ఆ ప్రాంతంలో గాలింపు చర్యలు చేపట్టగా, ఈ సందర్భంగా ఇరుపక్షాల మధ్య కాల్పులు చోటుచేసుకున్నాయి.

ఎన్‌కౌంటర్ అనంతరం రూపీ మృతదేహంతో పాటు ఆయుధాలను స్వాధీనం చేసుకున్నట్లు భద్రతా దళాలు వెల్లడించాయి. ఆ ప్రాంతంలో మరికొందరు మావోయిస్టులు దాగి ఉన్నారనే అనుమానంతో విస్తృతంగా గాలింపు కొనసాగుతోంది. గత నెలలో కూడా ఛత్తీస్‌గఢ్‌లోని బీజాపూర్ జిల్లాలో జరిగిన ఎదురుకాల్పుల్లో ఇద్దరు మావోయిస్టులు హతమైన సంగతి తెలిసిందే. ఎన్‌కౌంటర్ సమయంలో సుమారు పదిమంది మావోయిస్టులు అక్కడి నుంచి అడవుల్లోకి పారిపోయినట్లు సమాచారం. వారు దట్టమైన అటవీ ప్రాంతాన్ని ఉపయోగించి తప్పించుకున్నారని భద్రతా బలగాలు భావిస్తున్నాయి. వారిని గుర్తించి పట్టుకోవడానికి ప్రత్యేక బలగాలు రంగంలోకి దిగాయి. ఎన్‌కౌంటర్ అనంతరం ప్రాంతాన్ని పూర్తిగా చుట్టుముట్టి కూంబింగ్ ఆపరేషన్ కొనసాగుతోంది. భద్రతా బలగాలు అడవిలో గాలింపు చర్యలు ముమ్మరం చేశాయి. మరి కొంతమంది మావోయిస్టులు అటవీలో దాగి ఉండవచ్చనే అనుమానంతో ఆపరేషన్‌ను భద్రతా బలగాలు కొనసాగిస్తున్నాయి. మావోయిస్టుల కదలికలపై గత కొంతకాలంగా భద్రతా బలగాలు నిఘా పెంచాయి. వారికి వచ్చిన సమాచారం ఆధారంగా ఈ ఆపరేషన్‌ని చేపట్టినట్లు తెలుస్తోంది. దట్టమైన అటవీ ప్రాంతం కావడంతో ఈ ఆపరేషన్ జాగ్రత్తగా కొనసాగుతోంది. ఈ ప్రాంతం గతంలో కూడా మావోయిస్టు కార్యకలా పాలకు కేంద్రంగా ఉంది. తరచూ భద్రతా బలగాలు, మావోయిస్టుల మధ్య ఎదురుకాల్పులు జరుగుతు న్నాయి. మావోయిస్టులు ఉద్యమం ప్రభావం ఈ ప్రాంతాల్లో ఇంకా కొనసాగుతోండటంతో భద్రతా సవాళ్లు నెలకొన్నాయి. ఎన్‌కౌంటర్ నేపథ్యంలో సమీప గ్రామాల్లో భద్రతను పోలీసులు కట్టుదిట్టం చేశారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు. అటవీ ప్రాంతానికి వెళ్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలని స్థానికులకు హెచ్చరికలు జారీ చేశారు. మిగిలిన మరికొంతమంది మావోయిస్టులను పట్టుకోవడానికి డ్రోన్ సర్వైలెన్స్, ప్రత్యేక కూంబింగ్ బలగాలు ఉపయోగిస్తున్నట్లు సమాచారం. ఈ ఆపరేషన్ మరికొన్ని గంటలు లేదా రోజులు కొనసాగవచ్చని భద్రతా వర్గాలు చెబుతున్నాయి. మాచపల్లి అటవీ ప్రాంతంలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో ఒక మహిళా మావోయిస్టు మృతి చెందడం, పలువురు తప్పించుకోవడం పరిస్థితి తీవ్రతను సూచిస్తోంది. ప్రస్తుతం కొనసాగుతున్న కూంబింగ్ ఆపరేషన్‌లో మరిన్ని వివరాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది.

# రాయల్స్‌పై హైదరాబాద్ ఘన విజయం

### ప్రఫుల్ వండర్.. అరంగేట్రంలోనే సంచలన బౌలింగ్

### తొలి ఓవర్‌లో మూడు వికెట్లతో అరుదైన రికార్డు

### సకీబ్ నాలుగు వికెట్లతో విజృంభణ



ఐపీఎల్‌లో సంచలనం! పరుగుల వరద పారుతున్న లీగ్‌లో వికెట్ల వేట. సుదీర్ఘ లీగ్ చరిత్రలో సన్‌రైజర్స్ హైదరాబాద్ యువ బౌలర్ ప్రఫుల్ హింగే కొత్త చరిత్ర లిఖించాడు. ఇన్నింగ్స్ తొలి ఓవర్‌లోనే మూడు వికెట్లు పడగొట్టి తన ఆగమనాన్ని ఘనంగా చాటుకున్నాడు. రాజస్థాన్ రాయల్స్ చిచ్చరపిడుగు వైభవ్ సూర్యవంశీతో మొదలుపెట్టి జురెల్, ప్రిటోరియస్‌ను పెవిలియన్ పంపిన హింగే అరుదైన రికార్డ్ లిఖించాడు. చురుకైన వేగానికి స్వింగ్ జోడిస్తూ హింగే సాగించిన వికెట్ల విధ్వంసం మాటల కందనిది. సహచర బౌలర్ సకీబ్ హుస్సేన్‌తో కలిసి హింగే వికెట్ల వేటతో రాజస్థాన్ 9 పరుగులకే 5 వికెట్లు కోల్పోయింది.

ఆహా ఏం మ్యాచ్! స్టేడియంలో ప్రేక్షకులకు తోడు లక్షలాది మంది ఫ్యాన్స్‌ను ఓ ఊపు ఊపింది. సోమవారం ఉప్పల్ స్టేడియం వేదికగా సన్‌రైజర్స్ హైదరాబాద్(ఎస్ఆర్‌హెచ్), రాజస్థాన్ రాయల్స్ పోరు అభిమానులను కట్టిపడేసింది. ఎస్ఆర్‌హెచ్ నిర్దేశించిన 217 పరుగుల లక్ష్యఛేదనలో అరంగేట్రం యంగ్ గన్స్ ప్రఫుల్ హింగే (4/34), సకీబ్ హుస్సేన్ (4/24) ధాటికి రాయల్స్ 9 పరుగులకే 5 వికెట్లు కోల్పోయింది. ఐపీఎల్ సంచలనం వైభవ్ సూర్యవంశీ(0)తో మొదలైన హింగే వికెట్ల వేట ధ్రువ్ జురెల్ (0), డీ ప్రిటోరియస్ (0) వరకు ఘనంగా సాగింది.

ఇన్నింగ్స్ తొలి ఓవర్‌లోనే మూడు వికెట్లు తీసిన తొలి బౌలర్‌గా హింగే రికార్డు సృష్టిస్తే..తనదైన పేస్‌తో సకీబ్..రాయల్స్ నడ్డివిరిచాడు. బుల్లెట్‌లా దూసుకొచ్చిన బంతులను ఆడటంలో రాయల్స్ బ్యాటర్లు ఘోరంగా విఫలమయ్యారు. వీరి ధాటికి కనీసం 50 పరుగులైనా చేరుకుంటుందా అన్న దశలో ఫెరీరా(44 బంతుల్లో 69, 7ఫోర్లు, 3సిక్స్‌లు), జడేజా(32 బంతుల్లో 45, 5ఫోర్లు) రాయల్స్ పరువు నిలబెట్టారు. దీంతో రాయల్స్ 19 ఓవర్లలో 159 పరుగులకు చాపచుట్టేసింది. అంతకుముందు ఇషాన్ కిషన్(44 బంతుల్లో 91, 8 ఫోర్లు, 6సిక్స్‌లు) ధనాధన్ అర్ధసెంచరీ ధాటికి హైదరాబాద్ నిర్ణీత 20 ఓవర్లలో 216/6 స్కోరు చేసింది.

అభిషేక్‌శర్మ(0) గోల్డెన్ డక్‌గా వెనుదిరిగినా.. బ్యాటింగ్ భారాన్ని తనపై వేసుకుంటూ కిషన్ ఇన్నింగ్స్‌ను ముందుకు నడిపించాడు. మిడిల్‌లో క్లాసెన్(40)తో కలిసి కిషన్ కీలక భాగస్వామ్యంతో జట్టు భారీ స్కోరుకు కారణమయ్యాడు. ఆర్చర్(2/37) రెండు వికెట్లు తీశాడు. నాలుగు వికెట్లతో రాయల్స్ నడ్డివిరిచిన హింగేకు 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్' దక్కింది.

#### హింగే, సకీబ్ విజృంభణ:

2.6 ఓవర్లకు రాజస్థాన్ రాయల్స్ స్కోరు 5/9. హింగే, సకీబ్ పేస్ ధాటికి రాయల్స్ ఇన్నింగ్స్ కకావికలమైంది. గత మ్యాచ్‌ల అనుభవాలను దృష్టిలో పెట్టుకుని కుర్రాళ్లకు అవకాశమిచ్చిన ఎస్ఆర్‌హెచ్ ఊహించని ఫలితాన్ని అందుకుంది. అసలు ఎలాంటి అంచనాలు లేకుండా పోటీకి దిగిన హింగే..తొలి ఓవర్‌లో రాయల్స్ పతనానికి నాంది పలికితే..సకీబ్ దాన్ని తారాస్థాయికి తీసుకెళ్లాడు. మొత్తంగా ఇద్దరు అరంగేట్రం యువ పేసర్లు తమ స్వింగ్ బౌలింగ్‌తో రాయల్స్ బ్యాటర్ల వెన్నులో వణుకు పుట్టించారు.



లీగ్‌లో మేటి బౌలర్లను అలవోకగా ఎదుర్కొన్న సూర్యవంశీని హింగే గోల్డెన్ డక్‌గా పంపించగా, మంచి ఫామ్‌మీదున్న జురెల్ బంతిని వికెట్ల మీదికి ఆడుకుని మూల్యం చెల్లించుకున్నాడు. హెట్‌మైర్ బదులు జట్టులోకి వచ్చిన ప్రిటోరియస్ భారీ షాట్ ఆడబోయి నితీశ్ చేతికి చిక్కాడు. హింగేతో పోటీపడుతూ సకీబ్..జైస్వాల్(1), పరాగ్(4), ఫెరీరా, బిష్ణోయ్(0)ను పెవిలియన్ పంపి సత్తాచాటాడు. మిడిల్‌లో ఫెరీరా, జడేజా కలిసి ఆరో వికెట్‌కు 118 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పారు. వీరిద్దరు నిలదొక్కుకోపోతే రాయల్స్ పరువు గంగలో కలిసేది. ఆఖర్లో దేశ్‌పాండే(25) బ్యాటు ఝులిపించినా లాభం లేకపోయింది. 1

#### సంక్షిప్త స్కోర్లు

హైదరాబాద్: 20 ఓవర్లలో 216/6(కిషన్ 91, క్లాసెన్ 40, ఆర్చర్ 2/37, పరాగ్ 1/5),

రాజస్థాన్: 19 ఓవర్లలో 159 ఆలౌట్(ఫెరీరా 69, జడేజా 45, సకీబ్ 4/24, హింగే 4/34)




## మహిళల టీ20 ప్రపంచకప్‌కు ప్రైజ్ మనీ ఎంత పెరిగిందంటే?

రానున్న మహిళల టీ20 ప్రపంచ కప్ కోసం, అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ (ఐసీసీ) రికార్డు స్థాయిలో రూ.81 కోట్ల (87,64,615 డాలర్లు) ప్రైజ్ మనీని ప్రకటించింది. 12 జట్లతో జరిగే ఈ టోర్నమెంట్ 2026 జూన్-జూలైలో ఇంగ్లాండ్‌లో జరగనుంది. 2024లో యునైటెడ్ అరబిక్ ఎమిరేట్స్ (యూఏఈ)లో జరిగిన గత టోర్నమెంట్‌తో పోలిస్తే ఈ ప్రైజ్ ఫండ్ 10 శాతం అధికం. 2024 ఎడిషన్‌లో రూ.70 కోట్ల (79,58,077 డాలర్లు) నగదు బహుమతిని ప్రకటించారు. న్యూజిలాండ్ గెలిచిన గత టోర్నమెంట్‌లో 10 జట్లు పాల్గొనగా, రాబోయే మహిళా టీ20 ప్రపంచ కప్‌లో మరో రెండు జట్లు జత కలుస్తున్నాయి. ఈసారి విజేతగా నిలిచిన జట్టు రూ.21.8 కోట్లు, రన్నరప్ రూ.10 కోట్లు గెలుచుకోనున్నాయి. సెమీస్‌లో ఓడిన జట్లకు రూ.6 కోట్ల చొప్పున ఇవ్వనున్నారు. గ్రూప్ దశలో గెలిచిన ప్రతి జట్టుకు రూ.29 లక్షలు అందజేస్తారు. టోర్నీలో పాల్గొనే ప్రతి జట్టుకు (గ్యారెంటీ మనీ) కనీస హామీగా రూ.2.3 కోట్లు ఇవ్వాలని నిర్ణయించారు.







## మళ్లీ వివాదంలో చాహల్..

### 'మీరు క్యూట్‌గా ఉన్నారు' అంటూ నటికి మెసేజ్...?

భారత వెటరన్ లెగ్ స్పిన్నర్ యుజ్వేంద్ర చాహల్ మరోసారి వార్తల్లో నిలిచాడు. అయితే, ఈసారి క్రికెట్ వల్ల కాదు, ఓ కొత్త వివాదంతో. తన ఇన్‌స్టాగ్రామ్ ఖాతాకు చాహల్ వ్యక్తిగత సందేశం పంపాడని నటి, మోడల్ తాన్యా ఛటర్జీ చేసిన ఆరోపణలు ఇప్పుడు సోషల్ మీడియాలో దుమారం రేపుతున్నాయి. కొద్ది రోజుల క్రితమే సిగరెట్ తాగుతూ రోడ్డుపై పడేశాడనే ఆరోపణలు ఎదుర్కొన్న చాహల్‌కు, ఈ కొత్త వివాదం తలనొప్పిగా మారింది. 'గందీ బాత్', 'తిత్లియాన్' వంటి ఓటీటీ షోలతో గుర్తింపు పొందిన తాన్యా ఛటర్జీ, ఇటీవల మీడియాతో మాట్లాడుతూ తన ఇన్‌స్టాగ్రామ్ ఇన్‌బాక్స్‌ను చూపించింది. తన స్టోరీకి చాహల్ స్పందిస్తూ 'ఆప్ క్యూట్ హో' (మీరు క్యూట్‌గా ఉన్నారు) అని మెసేజ్ చేశాడని ఆమె ఆరోపించింది. ఇందుకు సంబంధించిన వీడియో ప్రస్తుతం ఇంటర్నెట్‌లో వైరల్ అయింది. అయితే, తాన్యా ఆరోపణల్లో ఎంతవరకు వాస్తవం ఉందనే విషయంపై స్పష్టత రావాల్సి ఉంది. ఈ వివాదం తెరపైకి రావడానికి కొద్ది రోజుల ముందే చాహల్ మరో వివాదంలో చిక్కుకున్నాడు. కారు నడుపుతూ సిగరెట్ తాగి, దానిని రోడ్డుపై పడేస్తున్నట్లుగా ఉన్న ఓ వ్యక్తి వీడియో వైరల్ కాగా, ఆ వీడియోలో ఉన్నది చాహలేనంటూ అభిమానులు, నెటిజన్లు తీవ్ర విమర్శలు గుప్పించారు. చాహల్ వ్యక్తిగత జీవితం గత కొంతకాలంగా తరచూ వార్తల్లో నిలుస్తోంది. 2025లో అతను తన భార్య ధనశ్రీ వర్మ నుంచి విడాకులు తీసుకున్నాడు. ఆ తర్వాత ఆర్జే మహ్వష్‌తో అతను సన్నిహితంగా ఉన్నట్లు వార్తలు వచ్చినా, కొన్నాళ్లకే ఇద్దరూ ఇన్‌స్టాగ్రామ్‌లో ఒకరినొకరు అన్‌ఫాలో చేసుకోవడంతో ఆ ప్రచారానికి తెరపడింది. ప్రస్తుతం ఐపీఎల్ 2026లో పంజాబ్ కింగ్స్ తరఫున ఆడుతున్న చాహల్, ఇప్పటివరకు 4 మ్యాచ్‌లలో 3 వికెట్లు పడగొట్టి ఫర్వాలేదనిపించాడు. మైదానం వెలుపల ఇలాంటి వివాదాలు చుట్టుముడుతున్నా, తన ఫిట్‌నెస్‌పై పూర్తి దృష్టి సారించినట్లు చాహల్ ఇటీవల వెల్లడించాడు. "నేను మద్యం సేవించడం మానేసి ఆరు నెలలకు పైగా అయింది. ఇప్పుడు నా వయసు 35. జట్టు కోసం 150 శాతం కష్టపడాలనుకుంటున్నాను. ఒక సీనియర్ ఆటగాడిగా నా నుంచి ఇతరులు స్ఫూర్తి పొందాలి" అని ఏబీ డివిలియర్స్ పాడ్‌కాస్ట్‌లో చాహల్ పేర్కొన్నాడు. గతేడాది పంజాబ్ జట్టు ఫైనల్ చేరడంలో కీలక పాత్ర పోషించిన చాహల్, ఈసారి కూడా ఎలాగైనా టైటిల్ గెలవాలని పట్టుదలతో ఉన్నాడు.

## డగౌట్‌లో ఫోన్ వాడకం

### ఆర్ఆర్ టీమ్ మేనేజర్‌కు బీసీసీఐ నోటీసులు.. 48 గంటల్లో వివరణకు ఆదేశం




నిబంధనలకు విరుద్ధంగా మ్యాచ్ సమయంలో డగౌట్‌లో ఫోన్ వాడిన ఘటనలో రాజస్థాన్ రాయల్స్ (ఆర్ఆర్) టీమ్ మేనేజర్ రోమీ భిందర్‌పై బీసీసీఐ విచారణ ప్రారంభించింది. ఈ వ్యవహారంపై వివరణ ఇవ్వాలంటూ బీసీసీఐకి చెందిన యాంటీ కరప్షన్ అండ్ సెక్యూరిటీ యూనిట్ (ఏసీఎస్‌యూ) ఆయనకు నోటీసులు జారీ చేసింది. శుక్రవారం రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరుతో జరిగిన మ్యాచ్‌లో ఈ ఘటన చోటుచేసుకుంది. డగౌట్‌లో యువ ఆటగాడు వైభవ్ సూర్యవంశీ పక్కన కూర్చున్న భిందర్, తన ఫోన్‌ను ఉపయోగిస్తున్న దృశ్యాలు కెమెరాకు చిక్కాయి. ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్ కావడంతో యాంటీ కరప్షన్ నిబంధనల ఉల్లంఘన జరిగిందంటూ తీవ్ర దుమారం రేగింది. ఈ ఘటనపై విచారణ జరిపి నివేదిక సమర్పించాలని ఏసీఎస్‌యూను ఆదేశించినట్లు ఐపీఎల్ గవర్నింగ్ కౌన్సిల్ ఛైర్మన్ అరుణ్ ధుమాల్ తెలిపారు. నోటీసు అందుకున్న 48 గంటల్లోగా తన వాదన వినిపించాలని భిందర్‌ను ఆదేశించారు. అయితే, ఈ వివాదం వెనుక భిందర్ అనారోగ్య సమస్యలు ఉన్నట్లు తెలుస్తోంది. గతంలో ఆయన తీవ్రమైన ఊపిరితిత్తుల సమస్యతో బాధపడి, నాగ్‌పూర్‌లోని ఓ ఆసుపత్రిలో సుదీర్ఘకాలం చికిత్స పొందారని సమాచారం. దీనికి తోడు ఆయనకు ఆస్తమా కూడా ఉందని, ఎక్కువ దూరం నడవటం, మెట్లు ఎక్కడం వంటివి చేయవద్దని వైద్యులు సూచించినట్లు ఫ్రాంచైజీ వర్గాలు చెబుతున్నాయి. వైద్య కారణాల రీత్యా డగౌట్‌లోకి ఫోన్ తీసుకెళ్లేందుకు భిందర్‌కు అనుమతి ఉన్నప్పటికీ, అక్కడ కూర్చుని దానిని ఉపయోగించడానికి నిబంధనలు అంగీకరించవు. డ్రెస్సింగ్ రూమ్‌కు వెళ్లాలంటే చాలా దూరం నడవాల్సి వస్తుందనే కారణంతోనే ఆయన డగౌట్‌లో ఫోన్‌ను చూసి ఉండవచ్చని తెలుస్తోంది. ఆయన ఫోన్‌లో కాల్స్ మాట్లాడలేదని, కేవలం స్క్రోల్ మాత్రమే చేస్తున్నారని ఫ్రాంచైజీ వర్గాలు అంటున్నాయి. ఈ నేపథ్యంలో భిందర్ ఇచ్చే వివరణ, ఆయన అనారోగ్య పరిస్థితిని పరిగణనలోకి తీసుకుని ఏసీఎస్‌యూ అధికారులు తుది నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది.



## 'డ్రాగన్' కోసం కండలు పెంచుతున్న తారక్..

టాలీవుడ్ స్టార్ హీరో జూనియర్ ఎన్టీఆర్ తన తర్వాతి సినిమా కోసం పూర్తిగా సిద్ధమవుతున్నారు. దర్శకుడు ప్రశాంత్ నీల్‌తో చేయనున్న భారీ యాక్షన్ చిత్రం కోసం ఆయన కఠోరంగా కసరత్తులు చేస్తున్నారు. తాజాగా తన ఇన్‌స్టాగ్రామ్ ఖాతాలో జిమ్‌లో వర్కౌట్ చేస్తున్న ఫొటోను పంచుకున్నారు. కెమెరాకు వీపు చూపిస్తూ, కండలు తిరిగిన తన శరీరాన్ని ప్రదర్శిస్తున్న ఈ ఫొటో సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. ఈ ఫొటోకు "కొన్నది కాదు.. కష్టపడి సంపాదించింది" అని ఎన్టీఆర్ క్యాప్షన్ జోడించారు. దీంతో ప్రశాంత్ నీల్ సినిమాలో ఆయన పాత్ర ఏ స్థాయిలో ఉండబోతుందోనన్న అంచనాలు మరింత పెరిగాయి. 'డ్రాగన్' అనే వర్కింగ్ టైటిల్‌తో ప్రచారంలో ఉన్న ఈ సినిమాలో బాలీవుడ్ నటుడు అనిల్ కపూర్, మలయాళ నటుడు బిజూ మీనన్ కూడా నటించనున్నారని సమాచారం. 1969 కాలంలో భారత్, చైనా, భూటాన్ సరిహద్దుల్లో జరిగే ఎమోషనల్ యాక్షన్ కథాంశంతో ఈ సినిమా ఉండబోతుందని తెలుస్తోంది. త్వరలోనే ఈ చిత్రం కొత్త షెడ్యూల్ ప్రారంభం కానుంది.



## కొత్త లుక్‌లో రామ్ చరణ్...

### 'ఎస్క్వైర్' కవర్‌పై పవర్‌ఫుల్‌గా గ్లోబల్ స్టార్!

గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ మరోసారి అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందారు. ప్రఖ్యాత 'ఎస్క్వైర్ ఇండియా' మ్యాగజైన్ లేటెస్ట్ ఎడిషన్ కవర్ పేజీపై ఆయన మెరిశారు. ఈ సందర్భంగా మ్యాగజైన్, రామ్ చరణ్‌ను "ప్రస్తుత తరాన్ని ప్రభావితం చేస్తున్న గ్లోబల్ ఫోర్స్" అని, "భారతీయ సినిమాకు ఒక ముఖ్యమైన ముఖచిత్రంగా నిలిచారు" అని అభివర్ణించింది. "రామ్ చరణ్ సినీ ప్రయాణాన్ని సెలబ్రేట్ చేస్తూ, ఆయన్ను మునుపెన్నడూ చూడని సరికొత్త రూపంలో మా కవర్‌పై ఆవిష్కరిస్తున్నాం" అని ఎస్క్వైర్ ఇండియా తన కథనంలో పేర్కొంది. ఈ ఫోటోషూట్‌ను ప్రత్యేకంగా హాంకాంగ్‌లో నిర్వహించినట్లు సమాచారం. ప్రస్తుతం రామ్ చరణ్, బుచ్చిబాబు సానా దర్శకత్వంలో 'పెద్ది' చిత్రంలో నటిస్తున్నారు. ఈ సినిమా షూటింగ్ నుంచి స్వల్ప విరామం తీసుకుని ఆయన హాంకాంగ్‌లో జరిగిన ఈ ఫోటోషూట్‌లో పాల్గొన్నారు. విశేషమేమిటంటే, 'పెద్ది' సినిమా కోసం మెయింటైన్ చేస్తున్న హెయిర్‌స్టైల్‌తోనే ఆయన ఈ షూట్‌లో కనిపించారు. దీంతో ఆయన లుక్‌పై అభిమానుల్లో మరింత ఆసక్తి పెరిగింది. ప్రస్తుతం ఈ ఫొటోలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి.

## 'భరతవర్ష: సాగా ఆఫ్ శూల'...

### గోపీచంద్ కొత్త చిత్రానికి పవర్ ఫుల్ టైటిల్

మాస్ హీరో గోపీచంద్ తన 33వ చిత్రంతో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నారు. ఈ సినిమాకు 'భరతవర్ష : సాగా ఆఫ్ శూల' అనే శక్తివంతమైన టైటిల్‌ను ఖరారు చేస్తూ, సోమవారం టైటిల్ గ్లింప్స్ వీడియోను విడుదల చేశారు. ఇందులో గోపీచంద్ మునుపెన్నడూ కనిపించని రీతిలో వారియర్ అవతారంలో ఆకట్టుకున్నారు. భీకర యుద్ధ సన్నివేశాలతో ఈ గ్లింప్స్ సినిమాపై అంచనాలను పెంచింది. ఈ చిత్రం 7వ శతాబ్దం నాటి అవిభక్త భారతదేశంలో జరిగిన వాస్తవ సంఘటనల ఆధారంగా తెరకెక్కుతోంది. చారిత్రక అంశాలకు పౌరాణిక నేపథ్యాన్ని జోడించి దర్శకుడు సంకల్ప్ రెడ్డి దీన్ని రూపొందిస్తున్నారు. గ్లింప్స్‌లో కనిపించిన గ్రాండ్ విజువల్స్, ఉత్కంఠభరితమైన నేపథ్య సంగీతం సినిమా స్థాయిని తెలియజేస్తున్నాయి. గోపీచంద్ కెరీర్‌లోనే అత్యధిక బడ్జెట్‌తో ఈ చిత్రాన్ని శ్రీనివాసా సిల్వర్ స్క్రీన్ బ్యానర్‌పై శ్రీనివాస్ చిట్టూరి నిర్మిస్తున్నారు. అనుదీప్ దేవ్ సంగీతం అందిస్తున్నారు. ఈ సినిమాలో గోపీచంద్‌కు జోడీగా రీతూ వర్మ నటిస్తోంది. గత కొంతకాలంగా సరైన విజయం కోసం ఎదురుచూస్తున్న గోపీచంద్‌కు ఈ భారీ హిస్టారికల్ యాక్షన్ చిత్రం కమ్‌బ్యాక్ ఇస్తుందని అభిమానులు ఆశిస్తున్నారు. విడుదల తేదీని త్వరలోనే అధికారికంగా ప్రకటించనున్నట్లు చిత్రబృందం తెలిపింది.





## బెడ్ మీద అలాంటి ఫోజులతో గత్తర లేపిన సిమ్రాన్ చౌదరి ఫోటోలు వైరల్!

సోషల్ మీడియా వాడకం పెరిగిపోయిన తర్వాత ప్రతి ఒక్కరు తమ ఉనికిని చాటుకోవడానికి తెగ పరితపిస్తున్నారు. ఒకవైపు సినిమాలలో బిజీగా ఉంటూనే.. మరొకవైపు ఇంస్టాగ్రామ్ వేదికగా అందాలు ఆరబోస్తూ ఫాలోవర్స్ ను పెంచుకునే ప్రయత్నం చేస్తున్నారు. సమయం సందర్భం లేకపోయినా సరే అందంగా ముస్తాబయ్యి.. కొంత మంది తమ ఫోటోలను షేర్ చేస్తే.. మరికొంతమంది ఉదయం బెడ్ పైనుంచి రాత్రి మళ్ళీ బెడ్ పైకి చేరేవరకు ఏమేం చేస్తున్నారు అనే ప్రతి విషయాన్ని కూడా ఫోటోల రూపంలో బంధించి సోషల్ మీడియా ద్వారా పంచుకుంటున్నారు. ఈ క్రమంలోనే మరొక అందాల తార కూడా తాజాగా ఉదయాన్నే బెడ్ పై నుండి కొన్ని గ్లామర్ ఫోటోలను పంచుకుంది. వైట్ నైటీలో అందాలు ఆరబోస్తూ బెడ్ పై వెల్లకిలా పడుకొని , బోర్లా పడుకొని ఇలా కొన్ని రకాల ఫోటోలను ఇంస్టాగ్రామ్ వేదికగా పంచుకుంది. ఇక ఈ ఫోటోలు చూసిన అభిమానులు పలు రకాల కామెంట్ చేస్తున్నారు. ఉదయాన్నే ఇలాంటి పోజులతో ఫోటోలు షేర్ చేయడంతో సిమ్రాన్ చౌదరి పై అభిమానులు ఒక్కొక్కరు ఒక్కో విధంగా తమ అభిప్రాయాలను వ్యక్తం చేస్తూ ఉండడం గమనార్హం.

## సుడిగాలి సుధీర్ తో దీపిక పిల్లి రిలేషన్..

### అసలు నిజం బయటపెట్టిన బ్యూటీ!



వెండితెర అయినా బుల్లితెర అయినా ఒక అమ్మాయి, అబ్బాయి జంటగా కనిపించారంటే చాలు వారి మధ్య ఎలాంటి రిలేషన్ ఉంది అనే ఆలోచన లేకుండా.. ఎఫైర్ రూమర్స్ అంటగడుతూ సెలబ్రిటీలకు తలనొప్పిగా మారుతున్న విషయం తెలిసిందే. అయితే ఈ ఆకతాయిలు అంతటితో ఆగకుండా ఏకంగా వారి సోషల్ మీడియా ఖాతాలను హ్యాక్ చేసి మరీ ఫలానా వ్యక్తులతో రిలేషన్ లో ఉన్నట్టు చెబుతూ సోషల్ మీడియాలో సంచలనం సృష్టిస్తున్నారు. ఈ క్రమంలోనే సుడిగాలి సుధీర్ తో దీపిక పిల్లి రిలేషన్ ఉన్నట్టు వాళ్ళిద్దరికీ సంబంధించిన ఫోటోలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. అయితే తాజాగా వీటిపై స్పందించి ఊహించని షాక్ ఇచ్చింది దీపిక పిల్లి. అసలు విషయం ఏమిటో ఇప్పుడు చూద్దాం.. బుల్లితెర మెగాస్టార్ గా తిరుగులేని క్రేజ్ సంపాదించుకున్న సుడిగాలి సుధీర్ అటు బుల్లితెరపై ఇటు వెండితెర పై కూడా మంచి పేరు సొంతం చేసుకున్నారు.. ఒకప్పుడు రష్మీతో ప్రేమలో ఉన్నట్టు వార్తలు రాగా.. అది కేవలం స్నేహం మాత్రమే అంటూ క్లారిటీ ఇచ్చారు . ఇలా ఎప్పటికప్పుడు సుధీర్ ప్రేమ , పెళ్లి విషయాలపై సోషల్ మీడియాలో ఏదో ఒక చర్చ జరుగుతూనే ఉంటుంది.. అయితే తాజాగా సుధీర్ లేడీ యాంకర్ దీపిక పిల్లి ప్రేమలో ఉన్నారని.. వీరిద్దరూ కలిసి విదేశాలలో విహరిస్తున్నారు అంటూ ఒక ఫోటో సోషల్ మీడియాలో విపరీతంగా చెక్కర్లు కొట్టింది. పైగా ఈ ఫోటో దీపికా పిల్లి ఇన్స్టాగ్రామ్ ఖాతా నుంచి షేర్ అవ్వడంతో సుధీర్ అభిమానులంతా నిజమే అని నమ్మేశారు. ఇక ఈ వార్త అలా వైరల్ అవ్వడంతో వెంటనే దీపిక పిల్లి స్పందించింది. దీపిక సుధీర్ తో పెళ్లి పీటలు ఎక్కబోతోంది అంటూ వార్త సంచలనం సృష్టిస్తున్న నేపథ్యంలో ఆమె మాట్లాడుతూ.." నా ఇంస్టాగ్రామ్ అకౌంట్ హ్యాక్ అయింది. ఆ ఫోటోతో నాకు ఎలాంటి సంబంధం లేదు . గత రాత్రి నా స్టోరీలో కనిపించిన ఈ ఫోటో ఏఐ ద్వారా సృష్టించబడింది. నా అనుమతి లేకుండా ఎవరో దానిని పోస్టు కూడా చేశారు. 24 గంటలుగా నా ఖాతాలో వస్తున్న ఏ కంటెంట్తో కూడా నాకు సంబంధం లేదు" అంటూ తన అకౌంటు హ్యాక్ అయిందన్న విషయాన్ని అలాగే సుధీర్ తో పెళ్లి అంటూ వస్తున్న వార్తలకు ఆమె చెక్ పెట్టింది.. ముఖ్యంగా సదరు ఫోటోని ఎవరూ షేర్ చేయొద్దని దీపిక అభిమానులను రిక్వెస్ట్ కూడా చేసింది.

### ఆ ప్రభుత్వ కార్యాలయంలో ఏళ్లుగా తిష్ట...

జనతా న్యూస్ ఎఫెక్ట్

# ఆరోపణలపై కథనానికి స్పందన

కరీంనగర్, ఏప్రిల్ 13: బెజ్జంకి మండలంలోని ప్రభుత్వ కార్యాలయంలో ఒక అధికారి ఏళ్లుగా కొనసాగుతున్నారనే ఆరోపణలపై ఇటీవల వెలువడిన కథనానికి అధికార యంత్రాంగం స్పందించింది. సంబంధిత అధికారిని జిల్లా కార్యాలయానికి అటాచ్ చేస్తూ జిల్లా కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. మధ్యవర్తుల ప్రభావం, రికార్డుల నిర్వహణలో పారదర్శకత లోపం, ఇసుక రవాణా వ్యవహారాల్లో అనుమానాస్పద పాత్ర వంటి అంశాలపై వచ్చిన ఆరోపణలు, ఫిర్యాదులు జిల్లా అధికారుల దృష్టికి వెళ్లినట్లు సమాచారం. ఈ నేపథ్యంలో కలెక్టర్ తక్షణ చర్యగా సదరు అధికారిని విధుల నుంచి తప్పించి జిల్లా కార్యాలయానికి అటాచ్ చేయడం జరిగింది. ఈ పరిణామంతో మండల ప్రజలు కొంత ఉపశమనం వ్యక్తం చేస్తున్నారు. స్థానికులు మాట్లాడుతూ పారదర్శక పరిపాలన కోసం తీసుకున్న ఈ చర్యను స్వాగతిస్తున్నామని పేర్కొన్నారు. అయితే ఆరోపణలపై సమగ్ర విచారణ జరిపి, వాస్తవాలు వెలికితీసి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. ఈ వ్యవహారంపై మరింత లోతైన దర్యాప్తు కొనసాగుతున్నట్లు అధికార వర్గాలు తెలిపాయి.

# అతివేగం, నిర్లక్ష్యంతోనే రోడ్డు ప్రమాదాలు



**చిన్న జాగ్రత్తలు పాటిస్తూ ప్రాణాలు కాపాడుకోవాలి**

**బైక్ పై హెల్మెట్, కారులో సీటు బెల్ట్ ధరించాలి**

**రోడ్ సేఫ్టీ పై అవగాహన పెంచుకోవాలి**

**కలెక్టర్ చిత్రా మిశ్రా**

తిమ్మాపూర్, జనతా న్యూస్ : ప్రస్తుత సమాజంలో అతివేగం, నిర్లక్ష్యంతో వాహనాలు నడిపి ఎందరో విలువైన తమ ప్రాణాలను కోల్పోతున్నారని.. ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రత నిబంధనలు పాటిస్తూ ప్రమాదాల నివారణకు కృషి చేయాలని కలెక్టర్ చిత్రా మిశ్రా పేర్కొన్నారు.

ప్రజాపాలన- ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా

రోడ్డు ప్రమాదాలను నివారించే ఉద్దేశంతో రెండో విడత అరైవ్ - అలైవ్ కార్యక్రమాన్ని తిమ్మాపూర్ మండలం రామకృష్ణ కాలనీలో ప్రారంభించారు. ఈనెల 13 నుంచి 18 వరకు అరైవ్ - అలైవ్ కార్యక్రమాలు నిర్వహించనున్నారు. మొదటి రోజైన సోమవారం రామకృష్ణ పంచాయతీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన గ్రామసభకు కరీంనగర్ సీపీ గౌస్ ఆలం, మానకొండూరు ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ, అదనపు కలెక్టర్ (రెవెన్యూ)లక్ష్మి కిరణ్, రవాణా శాఖ, వివిధ శాఖల అధికారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా రోడ్డు భద్రత సేఫ్టీ కమిటీ చైర్ పర్సన్ గా కలెక్టర్ మాట్లాడుతూ..

ప్రజల్లో చైతన్యం పెంచి రోడ్డు ప్రమాదాలను తగ్గించవచ్చన్నారు. జాగ్రత్తలతో ప్రాణాలు కాపాడుకోవచ్చు అని, రోడ్ సేఫ్టీ పై అవగాహన పెంచుకోవాలికలెక్టర్ చిత్రా మిశ్రా సూచించారు. రోడ్డు ప్రమాదాలను తగ్గించేందుకు సర్పంచ్ అధ్యక్షతన గ్రామానికి రోడ్డు కమిటీని ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. గ్రామ సభలో రోడ్డు భద్రత నిబంధనలు ప్రజలకు వివరించాలన్నారు. పంచాయతీరాజ్, ఆర్అండ్ బీ, రవాణా శాఖ అధికారులు.. రోడ్డు ప్రమాదాల నివారణకు స్పీడ్ బ్రేకర్ల ఏర్పాటు చేయాలన్నారు. ప్రాణాల కంటే ఏది విలువైంది కాదని చిన్న చిన్న జాగ్రత్తలు ప్రతి ఒక్కరూ పాటించాలన్నారు. క్షతగాత్రుల కోసం జీజీహెచ్ లో ట్రామా కేర్ ఏర్పాటు చేసినట్లు వివరించారు. గ్రామాల్లో అత్యవసర వేళ సంప్రదించాల్సిన అంబులెన్స్, పోలీసుల నెంబర్ పై అవగాహన కల్పించాలని సూచించారు. అందరి భాగస్వామ్యంతోనే రోడ్డు ప్రమాదాలు తగ్గుముఖం పడతాయని.. ప్రతి ఒక్కరూ రోడ్డుపైకి వచ్చినప్పుడు బాధ్యతతో మెలగాలని సూచించారు. సీపీ గౌస్ ఆలం మాట్లాడుతూ మన జిల్లాలో అలుగునూరు చౌరస్తా నుంచి రేణికుంట టోల్గేట్ వరకు హైవే పై ఎక్కువ రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని పేర్కొన్నారు. ఇందులో ఎక్కువమంది ద్విచక్ర వాహనదారులు, పాదాచారులేనని.. ప్రమాదం జరిగిన మొదటి గంటలోపు క్షతగాత్రులను ఆసుపత్రికి తీసుకెళ్తే వారి ప్రాణాలు కాపాడవచ్చని వివరించారు. ప్రమాదం గురించి తెలిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇచ్చి క్షతగాత్రులను ఆసుపత్రికి తరలిస్తే రహవీర్ సింగ్ పథకం కింద 25 వేల బహుమతి అందిస్తామన్నారు. మన జిల్లాలో రహవీర్ సింగ్ కింద 33 ఆసుపత్రులు క్యాష్ లెస్ సేవలు అందిస్తున్నట్లు వివరించారు. క్షతగాత్రులకు రూ. లక్షన్నర వరకు ఏడు రోజులు వైద్య సేవలు అందిస్తున్నట్లు వివరించారు.

బైక్ పై వెనకాల కూర్చున్న వ్యక్తి కూడా హెల్మెట్ ధరించాలన్నారు. మన వాహనాన్ని సకాలంలో సర్వీస్ చేయించుకోవాలని సూచించారు. రోడ్డు దాటేటప్పుడు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. రోడ్డు ప్రమాదాల్లో చనిపోయేవారు ఎక్కువగా 20- 40 ఏళ్ల వారు, వృద్ధులే ఎక్కువ అని.. జాగ్రత్తగా రోడ్డు దాటాలన్నారు.

రోడ్డు ప్రమాదం జరిగినప్పుడు.. ప్రమాద బాధితులకు సాయం చేయకుండా ఫోటోలు , వీడియోలు తీస్తున్నారని.. ఈ పరిస్థితిలో మార్పు రావాలని సిపి పేర్కొన్నారు. సహాయం అందిస్తే ఒకరి ప్రాణాలు కాపాడిన వారు అవుతారని సూచించారు. ప్రతి ఒక్కరూ సీపీఆర్, ప్రథమ చికిత్సపై అవగాహన కల్పిస్తామని సద్వినియోగం చేసుకోవాలని గ్రామస్తులకు సూచించారు. మానకొండూరు ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ మాట్లాడుతూ మనం ఏది ఆరంభశురత్వం మాదిరి చేయవద్దని .. నిరంతరం నిబంధనలు పాటించాలన్నారు. లైసెన్స్ లేకుండా పిల్లల చేతికి బండ్లు ఇవ్వవద్దని తల్లిదండ్రులకు సూచించారు. ఇంటి పెద్ద రోడ్డు ప్రమాదంలో మరణిస్తే.. ఆ కుటుంబం ఎన్నో కష్టాలు పడుతుందన్నారు. రోడ్డు ప్రమాదం.. ధనవంతులు, పేదలు అని చూడదని, కొందరు మంత్రులు, సినీ నటుల కుమారులను రోడ్డు ప్రమాదం బలి తీసుకుందన్నారు. మనం బాధ్యతగా రోడ్డు భద్రత నిబంధనలు పాటించాలన్నారు. తమ భర్తలకు తాగుడు మాన్పించాలని మహిళలకు సూచించారు. మద్యం సేవించి నడపడంతోనే ఎక్కువ రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని వాటి నివారణకు అరైవ్ - అలైవ్ (ఇంటికి చేరండి సురక్షితంగా) ప్రవేశపెట్టినట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా రోడ్డు ప్రమాదంలో ఇంటి పెద్దలను కోల్పోయిన ఇద్దరు మహిళలు తాము పడుతున్న కష్టాలను వివరించారు. తమలాంటి కష్టం ఎవరికి రావద్దని.. ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రత నిబంధనలు పాటించాలని కోరారు. అనంతరం రోడ్డు భద్రత నిబంధనలు వివరించే పెన్ డ్రైవ్ ను సర్పంచ్ కి అందజేశారు. అంతకుముందు ర్యాలీ తీసి ప్రధాన కూడలి వద్ద రోడ్డు భద్రత ప్రతిజ్ఞ గ్రామస్తులతో చేయించారు. వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పలువురికి హెల్మెట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా రవాణా శాఖ అధికారి శ్రీకాంత్ చక్రవర్తి, స్థానిక సర్పంచి గుజ్జుల శ్వేతా రెడ్డి ఉప సర్పంచ్ మల్లేష్ యాదవ్ రోడ్డు రవాణా శాఖ, వివిధ శాఖల అధికారులు సర్పంచులు పలు ప్రజా ప్రతినిధులు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.




# మహిళలకు 33% రిజర్వేషన్... చారిత్రాత్మక నిర్ణయం: చొప్పరి జయశ్రీ



కరీంనగర్, ఏప్రిల్ 13: దేశ రాజకీయాల్లో మహిళల భాగస్వామ్యాన్ని పెంచే దిశగా కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం చారిత్రాత్మకమని బీజేపీ మహిళా మోర్చా అధ్యక్షురాలు, కార్పొరేటర్ చొప్పరి జయశ్రీ అన్నారు. దశాబ్దాల నిరీక్షణకు ముగింపు పలుకుతూ మహిళలకు చట్టసభల్లో 33 శాతం రిజర్వేషన్ కల్పించే ప్రక్రియకు శ్రీకారం చుట్టిందని పేర్కొన్నారు. సోమవారం కరీంనగర్‌లోని పార్లమెంట్ కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడుతూ, మహిళలకు రాజకీయ ప్రాతినిధ్యం కల్పించే "నారీ శక్తి వందన్" బిల్లు ప్రవేశపెట్టడం సంతోషకరమని తెలిపారు. ఈ నిర్ణయం ద్వారా మహిళలు నిర్ణయాత్మక శక్తిగా ఎదిగే అవకాశాలు మరింత విస్తరించనున్నాయని అన్నారు. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం మహిళలకు సరైన రాజకీయ ప్రాధాన్యం ఇవ్వలేదని విమర్శించిన ఆమె, బీజేపీ ప్రభుత్వం మాత్రం మహిళల అభివృద్ధి, సాధికారత కోసం కట్టుబడి పనిచేస్తోందని పేర్కొన్నారు. మహిళల సంక్షేమం కోసం అనేక పథకాలు అమలు చేస్తూ, వారి స్థాయిని పెంచే దిశగా చర్యలు తీసుకుంటోందన్నారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో మహిళలకు సముచిత స్థానం కల్పించాలనే లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు సాగుతోందని, రాబోయే ఎన్నికల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్ అమలు దిశగా చర్యలు కొనసాగుతున్నాయని తెలిపారు. మహిళల సాధికారతతో దేశాభివృద్ధి మరింత వేగవంతం అవుతుందని ఆమె విశ్వాసం వ్యక్తం చేశారు.

# విగ్రహాల ముసుగులు తొలగించి శుభ్రం చేసిన అధికారులు



తిమ్మాపూర్, జనతా న్యూస్ : కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండలం ఎల్ఎండి పోలీస్ స్టేషన్ పక్కనే ఉన్న డాక్టర్ బిఆర్ అంబేద్కర్, బాబు జగ్జీవన్ రామ్ విగ్రహాల ముసుగులను అధికారులు సోమవారం సాయంత్రం తొలగించారు. విగ్రహాల పరిసర ప్రాంతాలను మానకొండూరు ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ ఆదేశాల మేరకు అంబేద్కర్ సంఘ నాయకులు, దళిత సంఘాల నాయకులు ఇప్పటికే శుభ్రం చేయించారు. సోమవారం సాయంత్రం అక్కడికి చేరుకున్న అధికారులు అధికారులు తిమ్మాపూర్ గ్రామపంచాయతీ సిబ్బందితో ముసుగులను తొలగించి విగ్రహాలను శుభ్రం చేయించారు. ఈ కార్యక్రమంలో కరీంనగర్ ఆర్డిఓ మహేశ్వర్, తిమ్మాపూర్ తాసిల్దార్ కర్ర శ్రీనివాస్ రెడ్డి, డిఎల్ పిఓ హరికిషన్, ఎంపీవో శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శి చంద్రశేఖర్ ఉన్నారు. మంగళవారం అంబేద్కర్ జయంతి ఉండడంతో ముందుగా శుభ్రం స్థానికంగా చర్చనీయాంశమైంది. మంగళవారం అంబేద్కర్ జయంతి రోజున విగ్రహాలను ఆవిష్కరిస్తారా లేదంటే సుందరీకరణ తర్వాత విగ్రహాలనావిష్కరిస్తారా అనేది సందిగ్ధంగా ఉంది.

# రోడ్డు భద్రత గ్రామసభలు విజయవంతం

**బెజ్జంకి ఎస్సై బి.సౌజన్య.**




జనత న్యూస్ బెజ్జంకి : రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు "ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక" లో భాగంగా సోమవారం మండల కేంద్రంతో పాటు , మండలంలోని వివిధ గ్రామాలలో బెజ్జంకి, బేగంపేట, వడ్లూర్, గూడెం, లక్ష్మీపూర్, వీరాపూర్, తోటపల్లి, గాగిలాపూర్, దాచారం, చీలాపూర్, కల్లేపల్లి మొదలగు గ్రామాలలో ఆయా గ్రామాల గ్రామపంచాయతీలు , పోలీస్ సిబ్బంది సౌజన్యంతో రహదారి భద్రత, గ్రామాల అభివృద్ధిపై ప్రత్యేక గ్రామసభలు నిర్వహించినట్లు బెజ్జంకి ఎస్సై బి.సౌజన్య పత్రిక ప్రకటనలో తెలిపారు. పోలీస్ అధికారులు, ఆయా గ్రామాల పంచాయితీ కార్యదర్శులు ప్రజలకు రోడ్డు సేఫ్టీ గురించి అవగాహన కల్పిస్తూ, రహదారులకు ఇరువైపులా పెరిగిన పొదలు, చెట్ల కొమ్మలు రోడ్డు ప్రమాదాలకు కారణమవుతున్నాయని, గ్రామస్తుల సహకారంతో వాటిని తొలగించి, రోడ్డు ప్రమాదాలను నివారించాలని ప్రజలకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల సర్పంచులు, ఉప సర్పంచులు, వార్డు సభ్యులు, పంచాయతీ కార్యదర్శులు, గ్రామ పెద్దలు, ఆశ, అంగన్వాడి కార్యకర్తలు, మహిళా సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

# పందులు రోడ్డు ప్రమాదాలకు కారణం

**బెజ్జంకి ప్రజల ఆందోళన.**

**తక్షణ చర్యలకు సర్పంచ్ బొల్లం శ్రీధర్ పెద్దన్న హామీ.**



జనత న్యూస్ బెజ్జంకి: మండల కేంద్రంలో జనావాసాల మధ్య పందుల పెంపకం జరుగుతుండటంపై గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సమస్యపై గ్రామస్థులు గ్రామపంచాయతీ కార్యాలయానికి చేరుకొని సర్పంచ్ బొల్లం శ్రీధర్‌పెద్దన్న కు ఫిర్యాదు చేశారు. గ్రామ ప్రజలు మాట్లాడుతూ పందుల వల్ల పరిసర ప్రాంతాల్లో తీవ్రమైన దుర్వాసన వ్యాపిస్తోందని, ఇది ప్రజల ఆరోగ్యానికి ముప్పుగా మారుతోందని, అలాగే ఇటీవల పందులు రోడ్డుపై వాహనదారులకు అడ్డు రావడంతో అనేక ప్రమాదాలు జరిగి పలువురు మృతి చెందిన ఘటనలను సర్పంచికి వివరించారు . వెంటనే చర్యలు తీసుకుని పందులను జనావాసాలకు దూరంగా తరలించేలా చూడాలని సర్పంచ్‌ను కోరారు. దీనిపై స్పందించిన సర్పంచ్ సమస్యపై సమగ్ర విచారణ జరిపించి తగిన చర్యలు తీసుకుంటామని ప్రజల కు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ దుమాల మహేష్, హెడ్ కానిస్టేబుల్ సుధాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ప్రజావాణిలో 21 ఫిర్యాదులు స్వీకరణ




కరీంనగర్, ఏప్రిల్ 13: కరీంనగర్ నగరపాలక సంస్థ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో ప్రజల నుండి వచ్చిన ఫిర్యాదులు, వినతులను అధికారులు స్వీకరించారు. అదనపు కమీషనర్ సువార్త, డిప్యూటీ కమీషనర్ ఖాధర్ మొహియుద్దీన్ తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మొత్తం 21 దరఖాస్తులు అందగా, ఇంజనీరింగ్ విభాగానికి 4, టౌన్ ప్లానింగ్‌కు 10, సానిటేషన్‌కు 1, రెవెన్యూ విభాగానికి 5, అకౌంట్స్ సెక్షన్‌కు 1 దరఖాస్తు వచ్చినట్లు అధికారులు తెలిపారు. ప్రజావాణిలో వచ్చిన ప్రతి దరఖాస్తును సంబంధిత శాఖల వారీగా పరిశీలించి, కమీషనర్ ఆదేశాల మేరకు పెండింగ్ లేకుండా త్వరితగతిన పరిష్కరిస్తామని అధికారులు తెలిపారు. ప్రజల సమస్యలకు ప్రాధాన్యతనిస్తూ చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

# “చావైనా బతుకైనా కరీంనగరమే”...

## రేవంత్ వ్యాఖ్యలకు బండి సంజయ్ ఘాటు కౌంటర్

కరీంనగర్, ఏప్రిల్ 13: ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలకు కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ తీవ్రంగా స్పందించారు. కరీంనగర్‌లో విడుదల చేసిన ప్రకటనలో ఆయన మాట్లాడుతూ తాను అవకాశవాది కాదని, ఎట్టి పరిస్థితుల్లోనూ వలస రాజకీయాలు చేయనని స్పష్టం చేశారు. “చావైనా బతుకైనా కరీంనగరంతోనే... నా తుది శ్వాస వరకు బీజేపీలోనే ఉంటాను. నేను చనిపోతే నా శవంపై కప్పేది కాషాయ జెండానే” అని బండి సంజయ్ పేర్కొన్నారు. తన రక్తంలోనే జాతీయవాదం ఉందని, తాను పార్టీకి కట్టుబడి ఉంటానని స్పష్టం చేశారు. రేవంత్ రెడ్డి వలస రాజకీయాలకు ప్రతిరూపమని విమర్శించిన ఆయన, పాలమూరు నుంచి మల్కాజ్‌గిరి వరకు వలస వెళ్ళింది ఆయనేనని ఆరోపించారు. రాజకీయ ప్రయోజనాల కోసం ప్రజల్లో భయాందోళనలు సృష్టించడం సరికాదన్నారు. డీలిమిటేషన్ అంశంపై కూడా బండి సంజయ్ స్పందిస్తూ, ప్రతి రాష్ట్రానికి 50 శాతం సీట్లు పెంచితే దక్షిణాదికి నష్టం ఏమిటో చెప్పాలని ప్రశ్నించారు. జనాభా, ఆర్థిక ప్రమాణాల పేరుతో ప్రజలను తప్పుదారి పట్టించే ప్రయత్నాలు జరుగుతున్నాయని విమర్శించారు. అంబేద్కర్ రాజ్యాంగాన్ని గౌరవించాలని సూచించిన ఆయన, ఓటు హక్కు, ప్రజాస్వామ్య విలువలను కాపాడాల్సిన బాధ్యత ప్రతి నాయకుడిపై ఉందన్నారు. అంబేద్కర్ జయంతి సందర్భంగా ఆయన సిద్ధాంతాలను పాటించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. రాజకీయ విమర్శలు పక్కనబెట్టి ప్రజల సమస్యలపై దృష్టి సారించాలని, విభజన రాజకీయాలు మానుకోవాలని బండి సంజయ్ సూచించారు.

# శ్రీపాదరావు సేవలు చిరస్మరణీయం

## సంగీతం శ్రీనివాస్, డిసిసి అధ్యక్షులు.



సిరిసిల్ల. ఏప్రిల్ 13. జనత న్యూస్. ఉమ్మడి రాష్ట్ర మాజీ స్పీకర్ దుద్దిల్ల శ్రీపాదరావు సేవలు చిరస్మరణీయమని డిసిసి అధ్యక్షులు సంగీతం శ్రీనివాస్ అన్నారు. సోమవారం గాంధీ చౌరస్తా వద్ద కాంగ్రెస్ పార్టీ నాయకులు ఉమ్మడి రాష్ట్ర లో స్పీకర్ గా పనిచేసిన దుద్దిల్ల శ్రీపాదరావు వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి కాంగ్రెస్ పార్టీ నాయకులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా డిసిసి అధ్యక్షులు సంగీతం శ్రీనివాస్ మాట్లాడుతూ శ్రీపాదరావు అందించిన సేవలను కొనియాడారు. ఆయన సేవలు చిరస్మరణీయమని అన్నారు. కార్యక్రమంలో నాయకులు చొప్పదండి ప్రకాష్, ఆడేపు చంద్రకళ, ప్రభాకర్,గడ్డం నరసయ్య, చొక్కల రాము, అన్నల్దాస్ భాను, పలువురు నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# అంబేద్కర్ జయంతి సందర్భంగా ట్రాఫిక్ మళ్లింపులు

కరీంనగర్, ఏప్రిల్ 13: డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ జయంతి ఉత్సవాలను పురస్కరించుకుని ఏప్రిల్ 14న కరీంనగర్ పట్టణంలో ట్రాఫిక్ మళ్లింపులు అమలు చేయనున్నట్లు పోలీస్ శాఖ ప్రకటించింది. నగరంలో భారీగా జనసందోహం ఉండే అవకాశాన్ని దృష్టిలో ఉంచుకుని వాహన రాకపోకలను క్రమబద్ధీకరించేందుకు ఈ చర్యలు చేపట్టినట్లు తెలిపారు. జగిత్యాల వైపు నుంచి వచ్చే భారీ వాహనాలను రేకుర్తి వద్ద మళ్లించి, శాతవాహన యూనివర్సిటీ -- పద్మనగర్ -- రాంనగర్ -- తెలంగాణ చౌరస్తా మార్గంగా ఆర్టీసీ బస్టాండ్‌కు వెళ్లేలా మార్గదర్శకాలు జారీ చేశారు. అలాగే గోదావరిఖని వైపు నుంచి వచ్చే వాహనాలను బొమ్మకల్ బైపాస్ వద్ద మళ్లించి, బద్దం ఎల్లారెడ్డి చౌరస్తా -- కమాన్ మార్గంగా బస్టాండ్‌కు చేరుకునేలా సూచించారు. నగరంలోని ప్రధాన కూడళ్లలో రద్దీ ఎక్కువగా ఉండే అవకాశం ఉన్నందున వాహనదారులు పోలీసులకు సహకరించాలని, సూచించిన మార్గాల్లోనే ప్రయాణించాలని అధికారులు కోరారు. అత్యవసర పనులు ఉన్నవారు ముందుగానే ప్రయాణ ప్రణాళిక సిద్ధం చేసుకోవాలని సూచించారు. ప్రజల సహకారంతో అంబేద్కర్ జయంతి వేడుకలను సాఫీగా నిర్వహించగలమని పోలీసులు తెలిపారు.

# మెడికవర్ ఆసుపత్రిపై విచారణ కోరుతూ ఏఐవైఎఫ్ వినతి




కరీంనగర్, ఏప్రిల్ 13: జిల్లా కేంద్రంలోని ఒక ప్రైవేట్ ఆసుపత్రిలో జరుగుతున్న వైద్య సేవలపై సమగ్ర విచారణ జరిపించాలని డిమాండ్ చేస్తూ అఖిల భారత యువజన సమైక్య (ఏఐవైఎఫ్) నాయకులు ప్రజావాణిలో జిల్లా అదనపు కలెక్టర్‌కు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఏఐవైఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి భావండ్లపల్లి యుగంధర్ మాట్లాడుతూ, ఆసుపత్రిలో జరుగుతున్న చికిత్స విధానాలపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయని, ఇటీవల జరిగిన కొన్ని మరణాలపై సంబంధిత అధికారులు సమగ్ర విచారణ చేపట్టాలని కోరారు. రోగుల భద్రత, వైద్య ప్రమాణాలు, అత్యవసర సౌకర్యాలు వంటి అంశాలను పరిశీలించాలని విజ్ఞప్తి చేశారు. అలాగే ఆసుపత్రి మౌలిక వసతులు, అగ్నిమాపక భద్రత, పార్కింగ్ సౌకర్యాలపై కూడా సంబంధిత శాఖలు తనిఖీలు నిర్వహించాలని కోరారు. ఆరోగ్య శాఖ అధికారులు నిబంధనల ప్రకారం పర్యవేక్షణను బలోపేతం చేసి, అవసరమైతే తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఆసుపత్రి సేవలపై వచ్చిన ఫిర్యాదులను పారదర్శకంగా పరిశీలించి, వాస్తవాలను వెలికితీయాలని ఏఐవైఎఫ్ నేతలు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ నగర కార్యదర్శి చెంచాల మురళి, రఘు, చరణ్, రాజు తదితరులు పాల్గొన్నారు.

# డంపింగ్ యార్డు సమస్యకు శాశ్వత పరిష్కారం దిశగా చర్యలు



కరీంనగర్, ఏప్రిల్ 13: నగర ప్రజలను ఎన్నో ఏళ్లుగా వేధిస్తున్న డంపింగ్ యార్డు సమస్యకు శాశ్వత పరిష్కారం చూపేందుకు చర్యలు చేపడుతున్నామని నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ తెలిపారు. బుధవారం నగర బైపాస్‌లో ఉన్న డంపింగ్ యార్డును అధికారులు, సిబ్బందితో కలిసి ఆయన తనిఖీ చేశారు. ఇటీవల డంపింగ్ యార్డులో మంటలు చెలరేగి పొగ, దుర్వాసనతో స్థానికులు ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో, మంటలను మూడు రోజుల్లో అదుపు చేయాలని అధికారులను మేయర్ ఆదేశించారు. వాటర్ ట్యాంకర్ల ద్వారా మంటలు, పొగను నియంత్రించేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. అనంతరం బయోమైనింగ్ పనులను పరిశీలించిన మేయర్, ప్రక్రియను వేగవంతం చేయాలని కాంట్రాక్ట్ ఏజెన్సీకి స్పష్టం చేశారు. ప్రతిరోజూ 150 నుండి 180 మెట్రిక్ టన్నుల చెత్త చేరుతున్నందున, పేరుకుపోయిన పాత వ్యర్థాలను త్వరగా తొలగించాలని ఆదేశించారు. నిర్దేశిత గడువులో పనులు పూర్తి చేయకపోతే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మేయర్ మాట్లాడుతూ, ప్లాస్టిక్, మట్టి తదితర వ్యర్థాలను శాస్త్రీయంగా వేరు చేసి డంపింగ్ యార్డు సమస్యకు శాశ్వత పరిష్కారం చూపుతామని తెలిపారు. గత 40 ఏళ్లుగా పేరుకుపోయిన చెత్తలో ఇప్పటికే లక్ష మెట్రిక్ టన్నులకు పైగా శుద్ధి చేశామని, మిగిలిన వ్యర్థాలను కూడా పూర్తిగా తొలగిస్తామని చెప్పారు. స్వచ్ఛ భారత్ మిషన్ 2.0 కింద కేంద్ర ప్రభుత్వం నుంచి ₹2 కోట్ల నిధులు మంజూరైనట్లు తెలిపారు. త్వరలో మరో బయోమైనింగ్ యంత్రాన్ని ఏర్పాటు చేసి రోజుకు 400 టన్నుల వ్యర్థాలను ప్రాసెస్ చేయనున్నట్లు వెల్లడించారు. డంపింగ్ యార్డును పూర్తిగా శుభ్రపరిచి, ఆ స్థలాన్ని ప్రజలకు ఉపయోగపడేలా అభివృద్ధి చేయడమే లక్ష్యమని మేయర్ పేర్కొన్నారు. ఈ పనులు పూర్తయితే మానేరు నది పరివాహక ప్రాంతంలో కాలుష్యం తగ్గి నగరవాసులకు ఉపశమనం కలుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్పోరేటర్లు, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

# అంబేద్కర్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించాలి: కలెక్టర్ చిత్రా మిశ్రా




కరీంనగర్, ఏప్రిల్ 14: డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా తెలిపారు. ఈ సందర్భంగా ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సోమవారం రాత్రి కరీంనగర్ కోర్టు చౌరస్తాలో ఉన్న అంబేద్కర్ విగ్రహం వద్ద చేపట్టిన ఏర్పాట్లను కలెక్టర్ స్వయంగా పరిశీలించారు. వేడుకలకు వచ్చే ప్రజలు, వివిధ సంఘాల నేతలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని సౌకర్యాలు కల్పించాలని అధికారులను ఆదేశించారు. వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకుని తాగునీరు, నీడ వంటి మౌలిక వసతులు ఏర్పాటు చేయాలని సూచించారు. అంబేద్కర్ జయంతి వేడుకలను కనీవినీ ఎరుగని రీతిలో నిర్వహించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. ప్రజా ప్రతినిధులు, అధికారులు, ఉద్యోగులు, ఎస్సీ, బీసీ, ఎస్టీ సంఘాల నాయకులు, అన్ని వర్గాల ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని వేడుకలను విజయవంతం చేయాలని కలెక్టర్ విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ మహేశ్వర్, ఎస్సీ కార్పొరేషన్ ఇన్‌చార్జి ఈడి తిరుపతిరావు, అర్బన్ తహసీల్దార్ నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

# అంబేద్కర్ రాజ్యాంగం దేశానికి దిక్సూచి: గంగాడి కృష్ణారెడ్డి




కరీంనగర్, ఏప్రిల్ 14: భారత రాజ్యాంగం దేశానికి దిక్సూచి లాంటిదని, రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ మహోన్నత సేవలు అందించారని బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి అన్నారు. అంబేద్కర్ జయంతి 135వ వార్షికోత్సవాలను పురస్కరించుకుని బీజేపీ రాష్ట్ర శాఖ పిలుపు మేరకు కరీంనగర్‌లోని రేకుర్తి ప్రాంతంలో అంబేద్కర్ విగ్రహ శుద్ధి, పరిసరాల శుభ్రత కార్యక్రమాన్ని బీజేపీ శ్రేణులు నిర్వహించాయి. అలాగే హుజురాబాద్ పట్టణంలో అంబేద్కర్ విగ్రహం వద్ద దీపాలు వెలిగించి నివాళులర్పించారు. ఈ కార్యక్రమాలకు ముఖ్య అతిథిగా హాజరైన గంగాడి కృష్ణారెడ్డి మాట్లాడారు. భారతదేశాన్ని లౌకిక, గణతంత్ర, ప్రజాస్వామిక దేశంగా తీర్చిదిద్దడంలో అంబేద్కర్ పాత్ర అపారమని ఆయన పేర్కొన్నారు. చట్టాలను రూపొందించడం మాత్రమే కాకుండా, ఆ చట్టాల ద్వారా సమానత్వాన్ని సాధించాలనే దృష్టితో పనిచేసిన మహానేతగా అంబేద్కర్ నిలిచారని అన్నారు. సాధారణ కుటుంబం నుండి ఎదిగి ఎన్నో కష్టాలను ఎదుర్కొని రాజ్యాంగ రూపకర్తగా ఎదిగిన అంబేద్కర్ జీవితం ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిదాయకమని తెలిపారు. ఆయన చూపిన మార్గంలోనే కేంద్రంలోని మోదీ ప్రభుత్వం నడుస్తూ బడుగు, బలహీన వర్గాల సంక్షేమానికి కట్టుబడి పనిచేస్తోందన్నారు. అంబేద్కర్ జయంతి కేవలం స్మరణ దినం మాత్రమే కాకుండా దేశానికి మార్గదర్శకమైన రోజుగా భావించాలని సూచించారు. ఈ కార్యక్రమాల్లో కార్పొరేటర్లు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# రోడ్డు భద్రతపై అవగాహన పెంచాలి: కలెక్టర్ చిత్రా మిశ్రా



కరీంనగర్, ఏప్రిల్ 14: ప్రజల భద్రతే ప్రధాన లక్ష్యంగా ప్రభుత్వం చేపట్టిన “అరైవ్--అలైవ్” కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా పిలుపునిచ్చారు. ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన పెంపొందించుకోవడం ద్వారా రోడ్డు ప్రమాదాలను తగ్గించవచ్చని సూచించారు. సోమవారం రాత్రి కలెక్టర్ క్యాంప్ కార్యాలయంలో 99 రోజుల ప్రజాపాలన--ప్రగతి ప్రణాళికలో భాగంగా నిర్వహిస్తున్న రోడ్డు భద్రత వారోత్సవాల వాల్ పోస్టర్లను కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వాహనదారులు తప్పనిసరిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని, అతివేగం, మద్యం సేవించి వాహనాలు నడపడం ప్రమాదాలకు ప్రధాన కారణాలని పేర్కొన్నారు. డ్రైవింగ్ సమయంలో మొబైల్ ఫోన్ వినియోగాన్ని పూర్తిగా నివారించాలని హెచ్చరించారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలి, నాలుగు చక్రాల వాహనదారులు సీట్‌బెల్ట్ వినియోగించాలని సూచించారు. పాదచారులు కూడా జాగ్రత్తగా రోడ్లు దాటుతూ జీబ్రా క్రాసింగ్‌లను వినియోగించాలని తెలిపారు. ప్రజల సహకారంతోనే రోడ్డు ప్రమాదాలను గణనీయంగా తగ్గించవచ్చని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఈ నెల 16న సుభాష్ నగర్‌లోని వాగేశ్వరి ఇంజనీరింగ్ కాలేజీలో మెడికల్ క్యాంపు నిర్వహించనున్నట్లు కలెక్టర్ తెలిపారు. బస్సు, ఆటో డ్రైవర్లకు వైద్య పరీక్షలు నిర్వహించడంతో పాటు విద్యార్థులకు రోడ్ సేఫ్టీపై అవగాహన కల్పించనున్నట్లు చెప్పారు. రవాణా శాఖ అధికారులు, ఎంవీఐలు, రోడ్ సేఫ్టీ ప్రతినిధులు, ఎన్‌జీవోలు పాల్గొన్నారు.

EDITED, PRINTED PUBLISHED AND OWNED BY YAMSANI SHIVA KUMAR, PRINTED AT SRI BALAJI PRINTING PRESS, H.NO : 4-4-85, KARIMNAGAR-504001 DISTRICT TELANGANA PUBLISHED AT H.NO:6-2-7A, HANMANWADA, JAGITYAL, VIL & MDL.DIST.KARIMNAGAR 506327 EDITOR : YAMSANI SHIVA KUMAR RNI NO: TELTEL/2014/55206, CELL NO: 79-89867251 Email: janathadaily@gmail.com